TITLE CODE: APTEL16281

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 207 | ఎడిటర్ : ఎం. రమేష్ | శుక్రవారం, జూన్ 28, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-



## దేశాభివృద్ధి ప్రతి ఒక్కరి.. లక్ష్యం కావాలి






దేశాభివృద్ధి ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆకాంక్షించారు..పదేళ్ల పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైందని తెలిపారు. రిఫార్మ్, పర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ ఆధారంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పెట్టుబడులు, ఉపాధి కల్పనకు ప్రాధాన్య మిచ్చామని తెలిపారు. 18వ లోక్‌సభ తొలి సమావేశాల నాలుగోరోజు ఆమో పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి మాట్లాడారు. గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు.. రానున్న ఐదేళ్లలో ప్రభుత్వ ప్రాధాన్యతలను ఆమె తన ప్రసంగంలో వివరించారు. మొదటగా ఆమె కొత్తగా గెలిచిన ఎంపీలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ ప్రజల విశ్వాసం గెలిచి లోక్‌సభకు ఎన్నికయ్యా రన్నారు. ప్రజల ఆకాంక్షలను ప్రతి సభ్యుడు నెరవేరుస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రథమ కర్తవ్యంగా ఎంపీలు పనిచేయాలన్నారు.

- న్యూఢిల్లీ, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్)

7

- పదేళ్ల పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టం
- రిఫార్మ్, పర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ ఆధారంగా ముందుకు
- మౌలిక వసతులు కల్పలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత
- వికసిత్ భారత్ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది
- నీట్, నెట్ పేపర్ లీకేజీపై కొనసాగుతున్న దర్యాప్తు
- ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం



## నిలకడగా అద్వానీ ఆరోగ్యం

వృద్ధాప్య సంబంధిత ఆరోగ్య సమస్యలు

యూరాలజీ వైద్యుల పర్యవేక్షణలో వైద్యం

ఎయిమ్స్ వైద్యుల ప్రకటన

7

## పోలీస్ వ్యవస్థను దిగజార్చిన గత ప్రభుత్వం




- నిధులు ఇవ్వకుండా నీరసింప చేశారు
- కేవలం నాయకుల రక్షణకే పోలీసులు ఉపయోగం
- గంజాయి నిర్మూలన, మహిళల రక్షణ తమ కర్తవ్యం
- కక్షసాధింపు చర్యలకు తాము ఎప్పుడూ దూరమే
- పోలీస్ ఉన్నతాధికారులతో హోంమంత్రి అనిత సమీక్ష

6

## జల్‌జీవన్‌పై డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

మ్యాచింగ్ గ్రాంట్ వివరాలు ఇవ్వాలని ఆదేశం





విజయవాడ,జూన్27(పీపుల్స్ మోటివేషన్): జల్‌జీవన్ మిషన్‌లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ వివరాలు ఇవ్వాలని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం ఈ పథకం నిధులను వినియోగించు కోలేకపోయిందని వ్యాఖ్యానించారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశమైన డిప్యూటీ సీఎం.. తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల డయేరియా కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. తాగు నీటి సౌకర్యం లేని గ్రామాలపై దృష్టి పెట్టాలని, జల్‌జీవన్ మిషన్ పథకం నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## సిఎస్ నీరబ్ కుమార్ సర్వీసు పొడిగింపు

ప్రభుత్వ అభ్యర్థను కేంద్రం అంగీకారం

మరో ఆరు నెలలపాటు ఆయనే ప్రభుత్వ కార్యదర్శి

7




## ప్రజలు, ప్రభుత్వం పరస్పర అంగీకారంతో రోడ్ల విస్తరణ

ఆర్.అండ్.బి శాఖ అధికారులతో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ నియంత్రణపై మంత్రి సమీక్ష

మంత్రి టి.జి భరత్

3





## రాజీకి వచ్చిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

### సిఎం రేవంత్‌తో ఉదయం చర్చలు

### కాంగ్రెస్ సీనియర్లకు ప్రధాన్యం తగ్గదని హామీ

కాంగ్రెస్‌లో జీవన్ రెడ్డి వివాదం సద్దుమణిగింది. సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి గురువారం ఉదయం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వెళ్లారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి నివాసంలో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ జరిగింది. ఈ భేటీకి మంత్రి శ్రీధర్ బాబు కూడా హాజరయ్యారు. బుధవారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను జీవన్ రెడ్డి కలిసారు. అధిష్టానం జోక్యంతో జీవన్ రెడ్డి తన రాజీనామా విషయంలో వెనక్కి తగ్గారు. సిఎం రేవంత్‌తో చర్చించిన తరవాత చల్లబడ్డారు.

- న్యూఢిల్లీ, (పీపుల్స్ మోటివేషన్)

7

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

## ఉద్యోగ,ఉపాధి రంగాల నిర్వీర్యం

### ప్రజల ఆర్థికస్థితిపై ధరలపోటు

**న్యూఢిల్లీ,జూన్27(పీపుల్స్ మోటివేషన్) :**

ఇప్పటికే రెండుకోట్ల మందికి ఉపాధి గల్లంతయ్యిందన్న వార్తలు వస్తున్నా అది అంతకు మించి ఉంటుందని అంటున్నారు. దేశంలో నిరుద్యోగానికి తోడు, ఉపాధి అవకాశాలు మందగిస్తున్నాయి. మరోవైపు వస్తూత్పత్తి పెరిగినా..ధరల పోటు తప్పడంలేదు. ఉపాధి దొరక్క నేటికీ వేలాదిమంది విదేశాల బాటు పడుతున్నారు. ఆర్థిక పునరుత్తేజానికి, వృద్ధిరేటును పెంచడానికి నవతరం సంస్కరణలు అవసరమని తెలిపారు. విద్యుత్తు, బ్యాంకింగేతర ఆర్థికసంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రంగాల సమస్యలు సత్వరం పరిష్కరించాల్సి ఉందని, ప్రైవేటు పెట్టుబడులు పెరిగేందుకు సరికొత్త సంస్కరణలు అవసరమని తెలిపారు. ప్రైవేటురంగ విశ్లేషకుల నుంచి వృద్ధిరేటు అంచనాలు వేర్వేరుగా ఉంటున్నాయని, వీటిల్లో చాలావరకు ప్రభుత్వ అంచనాల కంటే తక్కువగా ఉంటున్నాయని అప్పట్లో పదేపదే రాజన్ గుర్తు చేశారు. దేశంలో ఆటోమొబైల్ రంగ క్షీణత అన్నది నిరుద్యోగాన్ని పెంచే చర్యగా చూడాల్సి ఉంది. కంపెనీలు అమ్మకాలు లేకుండా మూతపడితే నష్టమని గుర్తుంచుకోవాలన్నారు. ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని, పరిష్కారానికి నూతన సంస్కరణలు అవసరమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్వ గవర్నర్ రఘురామ్ రాజన్ అప్పట్లో చేసిన హెచ్చరికలు పట్టించు కోలేదు. మొత్తం మీద ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని అన్నారు. వివిధ రంగాలు ఇబ్బంది పడుతున్నా, వాహన రంగం మాత్రం రెండు దశాబ్దాల్లోనే ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సంగతి విదితమే. వాహన, అనుబంధ రంగాల్లో వేలసంఖ్యలో ఉద్యోగాలు తొలగి స్తున్నారని, స్థిరాస్తి రంగంలో అమ్ముడు కాకుండా నిర్మాణాలు భారీగా మిగిలిపోతున్నాయని, ఎఫ్‌ఎంసీజీ రంగంలో విక్రయాలు తగ్గుతున్నాయనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ఆయా రంగాల నుంచి ఉద్దీపనల కోసం విజ్ఞప్తులు అధికమవుతున్నాయని రాజన్ గుర్తు చేశారు. ప్రస్తుతం కంటే వృద్ధిరేటును మరో 2-3 శాతం పెంచాలంటే, ఏ విధంగా దేశాన్ని ముందుకు నడిపించాలనే విషయంపై అవగాహన ఉండాలి. విద్యుత్తు, ఎన్‌బీఎఫ్‌సీ రంగాల్లో సత్వరం సమస్యలు పరిష్కరించాలి. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు వచ్చేలా దీర్ఘకాలిక దృక్పథం కలిగిన సంస్కరణలూ కావాలి. ప్రోత్సాహకాలు, ఉద్దీపనలు తాత్కాలికంగా మాత్రమే ఉపకరిస్తాయి. జీడీపీని మనం ఎలా గణిస్తున్నామో, స్వతంత్ర నిపుణుల పర్యవేక్షణ ఉండాలని రాజన్ విశదీకరించారు. గత ఆర్థిక సంక్షోభంతో పోలిస్తే, ప్రస్తుతం అంతర్జాతీయంగా బ్యాంకుల స్థితి బాగానే ఉందని రాజన్ తెలిపారు. 2008లో పరపతి విధానం కీలకమైంది. ఇప్పుడు మెరుగైన విధానం కాదు, ప్రత్యేక విధానం కావాలి. మరో భారీ ఆర్థిక సంక్షోభం వస్తుందని భావించడం లేదని అయితే మన జాగ్రత్తలో మనం ఉండాలన్నారు. కరోనా నేపథ్యంలో అన్ని అంచనాలు తలకిందులు అయ్యాయి. వాటిని గమనంలోకి తీసుకుని ముందుకు సాగాల్సిన సమయమిదని ఆర్థిక వేత్తలు సూచిస్తున్నారు. బ్యాంకింగ్ రంగాన్ని పట్టాలకెక్కించేందుకు అన్ని బ్యాంకులు యత్నిస్తున్నాయి. గృహ,వాహన రుణాలపై వడ్డీలు తడిసి మోపెడు కావడంతో మందగమనం కనిపిస్తోంది. అలాగే కస్టమర్లపై ఎడాపెడా వడ్డింపులకు దూరంగా ఉండాలని నిపుణులు చూస్తున్నారు.. ఇప్పటికే బ్యాంకుల తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. ఆన్‌లైన్ లావాదేవీలను ప్రోత్సహించాలని చూస్తోంది. యోనో వంటి యాప్‌ల ద్వారా, దేశీయంగా డెబిట్ కార్డుల వినియోగాన్ని తగ్గించగలమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దేశం మొత్తంమీద దాదాపు 93 కోట్ల డెబిట్, క్రెడిట్‌కార్డులు వినియోగంలో ఉన్నాయని వెల్లడించారు. యోనో యాప్ సాయంతో ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరించవచ్చని, కార్డు లేకుండా దుకాణాల్లో చెల్లింపులు పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు.

## మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

**నిజామాబాద్,జూన్27(పీపుల్స్ మోటివేషన్) :**

హరితహారం కావచ్చు, మొక్కలు నాటడం కావచ్చు. పచ్చదన్నం కావచ్చు..కార్యక్రమం ఏదైనా మొక్కలు పెంచడం, కాపాడుకోవడం ప్రజల విధి కావాలి. ఇందుకు ప్రభుత్వం కూడా గట్టిగా కృషి చేయాలి. ఇది ప్రతి ఒక్కరి కార్యక్రమమని, దీనిని సమిష్టిగా చేపట్టినప్పుడే ఫలితాలు రాబట్టవచ్చని గుర్తించాలి. తాము చేపట్టిన హరితహారం కార్యక్రమం వల్ల గ్రీన్ కవర్ 7.7 శాతం పెరిగిందని గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించుకుంది. ఇది నిరంతరంగా సాగితే త్వరలోనే తెలంగాణ ఆకుపచ్చని తెలంగాణ కాగలదని అన్నారు. అయితే ప్రభుత్వంలో ఎవురు ఉన్నా లేకున్నా..మొక్కలు పెంచడం నిరంతర ప్రకరియ కావాల్సి ఉంది. దీనిని మరింత చైతన్యవంతంగా తీసుకుని వెళితే కోతులు వాపస్ పోవడం.. వానలు వాపస్ రావడం ఖాయం కాగలదు. జూన్ మాసాంతం వచ్చినా నేటికీ వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడానికి వర్షాభావ వాతావరణమే కాకరణం. మొక్కలు నాటడం, పెంచడం అన్నది నిరంతర పక్రియ అని ప్రజలంతా గుర్తుంచుకోవాల్సి ఉంది. వంద శాతం పచ్చదనం ఉండేలా మొక్కలు నాటాల్సిన అవసరం ఉంది. ప్రతి ఒక్కరూ దీనిని సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రభుత్వంతో కలసి రావాల్సి ఉంది. ప్రతి జిల్లాను హరిత జిల్లాగా మార్చాలనీ, ఇందుకు అధికారులంతా సమష్టిగా కృషి చేయాల్సి ఉంది. రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలి. ఏ రకం మొక్కలు ఏయే ప్రదేశాల్లో నాటాలో అటవీ శాఖ అధికారులు సూచనలివ్వాలి. సరైన సమయంలోనే మొక్కలు నాటడం చేపట్టాలి. వెన్యూ ప్లాంటేషన్‌కు పండ్ల మొక్కలను సంబంధిత గ్రామప్రజలతో మాట్లాడి వారి సహాయ సహకారాలతో నాటితే కోతుల బాధ కొంతయినా పోతుంది. ప్రభుత్వ నర్సరీల్లో మొక్కలు సరైన దశలో వృద్ధి చెందిన మీదటే నాటేందుకు చర్యలు చేపట్టాలి. అన్ని పాఠశాలల్లో పచ్చదనం ఉండేలా మొక్కలు నాటేలా విద్యార్థులను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలి. పట్టణాల్లో జంక్షన్లు, రోడ్ల సుందరీకరణకు మొక్కలు నాటాలి. అవసరాలకు ఏయే రకం మొక్కలు ఎన్ని కావాలో సర్వే చేసి తదనుగుణంగా నర్సరీల్లో మొక్కల పెంపకం చేపడితే ప్రయోజనం చేకూరుతుంది. ఈ సంవత్సరం లక్ష్యాన్ని చేరుకునే విధంగా మొక్కలను నాటాల్సి ఉంది. అధికారులు దృఢనిర్చయంతో ముందుకు సాగాలి. గతేడాది వరుణ దేవుడు కరుణించడంతో నాటిన మొక్కలు జీవం పోసుకుంటున్నాయి. ఇందులో భాగంగానే ఫారెస్ట్ నర్సరీలో లక్షల్లో వివిధ రకాల మొక్కల పెంపకం, అలాగే ఈజీఎస్ కింద వివిధ రకాల మొక్కలను పెంచిపోషిస్తున్నారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురుస్తున్న కారణంగా కార్యక్రమాన్ని ఒక మహోత్తర ఉద్యమంగా ముందుకు తీసుకెళ్ళాల్సి ఉంది. మొక్కలు నాటించి ఈజీఎస్ కూలీల ద్వారా నాటిన మొక్కల చుట్టూ రక్షణ కంచెలు సైతం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేయాలి. కోట్లాది రూపాయల ఖర్చుతో వివిధ శాఖల ఆధ్వర్యంలో పండ్లు, పూలు, అటవీ, మిశ్రమ జాతి మొక్కలతో ఇతర మొక్కల పెంపకాన్ని చేపట్టారు. వన విభాగం కింద ఒకటి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నర్సరీలను నెలకొల్పి మొక్కల పెంపకం చేపట్టడం అవసరం.

## నాడు ప్రకటిత ఎమర్జెన్సీ..నేడు అప్రకటిత ఎమర్జెన్సీ !

భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ నిస్సందేహంగా ఒక చీకటి అధ్యాయం. అయితే ఆనాటి రాజకీయ పరిస్థితులు నాడు ఇందిరాగాంధీని అలా ప్రేరేపించి వుంటాయి. అయినా దేశమంతా వ్యతిరేకించారు కనుక తప్పే. దాదాపు 40 ఏళ్ల క్రితం నాటి విషయాన్ని ఎంచుకుని ఇప్పుడు రాజకీయం చేయాలని చూడడమే సరికాదు. అలా అయితే అనేక విషయాలను ముందేసుకుని తిడుతూ కూర్చోవాలి. బ్రిటిషర్లు రావడమే తప్పు. అంతకుముందు మొగలులు పాలించడం కూడా తప్పే. మనదేశ సంస్కృతి సంప్రదాయాలను దెబ్బతీయడం మరీ తప్పు. ఇవన్నీ కూడా మననం చేసుకుని మంచి చేయడం కోసం ముందుకు సాగాలి. గొంగట్లో కూర్చుని తింటూ..వెంట్రుకలు వస్తున్నాయని చెప్పడం సరికాదు. విపక్షంగా కాంగ్రెస్ బలంగా లోక్‌సభలో అడుగు పెట్టడంతో మోడీకి చెమటలు పడుతున్నాయా అన్న సందేహం కలుగుతుంది. గిల్లి కజ్జాలుపెట్టుకోవాలన్న మనస్తత్వంతోనే దీని గురించి పదేపదే ప్రస్తావిస్తూ..అసలు సమస్యలను పక్కదారి పట్టించే కుట్రలు చేస్తున్నారని భావించాలి. మోడీ, స్పీకర్ ఓం బిర్లా, చివరకు రాష్ట్రపతి ప్రసంగంలోనూ ఇప్పుడు ఎమర్జెన్సీ గురించి ప్రస్తావించడం అసవరమా అన్న అనుమానం వస్తోంది. జూన్ 25న ఇందిరా గాంధీ హయాంలో ఎమర్జెన్సీ ప్రకటన వెలువడిన రోజు... మొన్నటి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం రోజయిన జూన్ 24వ తేదీన..ప్రధాని మోడీ ఎమర్జెన్సీ గురించి ప్రస్తావించారు. లోక్‌సభలో స్పీకర్ ఓంబిర్లా 26వ తేదీన ప్రస్తావన చేశారు. ఇప్పుడీ అంశం అవసరమా అన్నదే ముఖ్యం. నిజానికి ఎమర్జెన్సీ లేకుండానే రైతులు ఢిల్లీ వీధుల్లో తిరగకుండా చేశారు. వారు ఆందోళన విరమించేలా చయడంలో మోడీ ప్రభుత్వం విఫలం అయ్యింది. కనీసం వారితో చర్చించడానికి కూడా మోడీ ముందుకు రాలేదు. అనధికారికంగా వందమందిక పైగానే మరణించారు. ఇంతకన్నా దారుణం ఉంటుందా... .కరోనాతో వేలాదిమంది మరణిస్తే లెక్కలు దాచేయడం ఎక్కడి ప్రజాస్వామ్యం. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా విషయాలు ఉన్నాయి. దాదాపు అర్ధ శతాబ్దం క్రితం, 1975 జూన్ 25న భారత రాష్ట్రపతి ఫకృద్దీన్ అలీ అహ్మద్ అధికారికంగా ఎమర్జెన్సీని ప్రకటించారు. అందుకు కారణం అలహాబాద్ హైకోర్టు తీర్పు. దీని ప్రకారం 1971లో ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదు. అధికార భీతితో ప్రభుత్వం హడావుడిగా రాజ్యాంగంలోని 352వ అధికరణను వర్తింపజేసి అత్యవసర పరిస్థితిని విధించింది. ఇది 1977 మార్చి 21 వరకు కొనసాగింది. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చీకటి కాలం.త్యవసర పరిస్థితి ప్రకటించిన వెంటనే పత్రికా స్వేచ్ఛను హరించేలా ప్రభుత్వం ఒక చట్టం చేసింది. ప్రభుత్వ నియంత్రణలో ఉన్న వార్తాపత్రికలు, ఆకాశవాణి, దూరదర్శన్ మాత్రం ప్రభుత్వ వైభవాన్ని ప్రసారం చేస్తూనే ఉన్నాయి. వార్తాపత్రికలు, మ్యాగజైన్ల నుండి తమకు అభ్యంతరకరమైన విషయాలను తొలగించేం దుకు బ్యూరో ఆఫ్ ప్రెస్ సెన్సార్‌షిప్ పని చేసింది. అయినప్పటికీ, కొన్ని వార్తాపత్రికలు, అనేక మంది జర్నలిస్టులు ప్రధానంగా నిజాన్ని పేర్కొనేందుకు ప్రయత్నించారు. ఫలితంగా ఎందరో ఎడిటర్లు, జర్నలిస్టులు అరెస్ట్ కావాల్సి వచ్చింది. పార్లమెంటరీ వ్యవస్థను నిర్లక్ష్యం చేశారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీలపై దాడులు, దేశవ్యాప్తంగా మూకుమ్మడి అరెస్టులు జరిగాయి. సమావేశాలు, ప్రదర్శనలు, ఊరేగింపులు, సమావేశాలు నిషేధించబడ్డాయి. జ్యోతిబసు, జయప్రకాష్ నారాయణ్, మొరార్జీ దేశాయ్, అద్వానీ, జార్జి ఫెర్నాండెజ్ సహా దేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులు జైళ్ల పాలయ్యారు. మీసా తదితర చట్టాల కింద వేలాది మంది రాజకీయ కార్యకర్తలు, నాయకులను అరెస్టు చేశారు. అంతేగాక, సామాన్య ప్రజల ప్రాథమిక హక్కులు కూడా ప్రమాదంలో పడ్డాయి. భావ ప్రకటనా స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కు, పౌరహక్కులు హరించబడ్డాయి. సాంస్కృతిక ప్రపంచంలో ఆంక్షలు, అరెస్టులు కూడా జరిగాయి. నాటక ప్రదర్శనల నిషేధం, సినిమా ప్రదర్శనల నిలిపివేత జరిగాయి. కానీ ఎమర్జెన్సీ లేకుండానే ఇప్పుడు ఆనాడు ఇందిర అమలు చేసిన అన్ని విధానాలు అమలవుతున్నాయి. ఇడి, ఐటి,ఐబిలను ఉపయోగించి విపక్ష నేతలను, సిఎంలను అరెస్ట్ చేసి జైళ్లలో వేసేస్తున్నారు. ధర్నాలు లేవు. పార్లమెంటులో మాట్లాడే హక్కులు లేకుండా చేశారు. మూకుమ్మడిగా సభ్యులను సభనుంచి పంపించేశారు. నరేంద్ర మోడీ హయాంలో అన్నిటినీ పీఎంఓ కార్యాలయం కేంద్రంగా మారింది. మోడీ ఎప్పుడూ ప్రజాస్వామ్య బాటలో నడవలేదు. విలేకరుల సమావేశంలో జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు ఎన్నడూ సమాధానం ఇవ్వరు. మీడియా సమావేశాలకు దూరంగా ఉంటారు. పార్లమెంటులో విపక్షాల చర్చను ఆయన వినరు. ఎవరి మాట వినకుండా, పార్లమెంట్‌లో చర్చ లేకుండానే డీమోనిటైజేషన్ చేశారు. కోవిడ్ కాలంలో అహేతుక, అశాస్త్రీయ చర్యలను చేపట్టారు. పి.ఎం కేర్స్ ఫండ్‌ను ప్రైవేట్ ఫండ్‌గా మార్చారు. ఎటువంటి చర్చ లేకుండా ఎలక్టోరల్ బాండ్లని ప్రవేశపెట్టారు. క్రమంగా రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు తగ్గుతున్నాయి. వారికి విలువ లేకుండా చేస్తున్నారు. పార్లమెంటులో చర్చకు అవకాశం రావడం లేదు. పార్లమెంటరీ వ్యవస్థలో చట్టాలు చేసే హక్కును తీసివేసి ఆర్డినెన్స్ రాజ్‌ని స్థాపించారు. వ్యవసాయ చట్టం, విద్యుత్ చట్టం ఆర్డినెన్స్‌లు చేసి అమలుకు దిగింది. పార్లమెంటులో మెజారిటీ వుండడంతో బిల్లులను దాదాపు బలవంతంగా ఆమోదించడం ఆనవాయితీగా మారింది.


భారత రాజ్యాంగం ముఖ్య లక్షణాలలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్య నిర్మాణం ప్రధానమైనవి. కానీ మోడీ ప్రభుత్వం రాజ్యాంగ సారాంశం పైనే క్రమపద్ధతిలో దాడికి దిగింది. ప్రతిపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేయడానికి, ప్రభుత్వాలను స్వాధీనం చేసుకోవడానికి, ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందడానికి ఇ.డి, సిబిఐ వంటి కేంద్ర సంస్థలను వినియోగించుతున్నది. కార్పొరేట్లకు అనుకూలంగా ప్రభుత్వం నల్ల వ్యవసాయ చట్టాలను ఆమోదించబోయి భంగపడింది. దేశానికి అన్నం పెట్టే రైతాంగం పైనే యుద్దానికి దిగి వారిని క్రూర హింసలకు గురి చేసింది. స్వతంత్ర జర్నలిస్టులు, పోర్టళ్లు, సోషల్ మీడియాను నియంత్రించేందుకు ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేసింది. ఇవన్నీ ఎమర్జెన్సీలో ఇందిర చేయగా, ఇప్పుడు ఎమర్జెన్సీ అన్న పదం మాత్రం లేకుండా మోడీ అన్నీ చేస్తున్నారు. పార్టీలో చర్చలు లేవు. ప్రభుత్వంలో చర్చలు లేవు. విపక్షాలను పిలిచి చర్చించే సంప్రదాయం లేకుండా చేశారు. ప్రజల్లో చర్చ ఉన్నా విలువ లేదు. ఇలాంటి తీరును అవలంబిస్తున్న ప్రధాని మోడీ తన విధానాలు మర్చుకుంటే మంచిది. అది తగదన్నట్లు దానికి పరాకాష్టగా ఇప్పుడు ఎమర్జెన్సీ చీకటి రోజులు అంటూ మాట్లాడుతున్నారు. ఇలాంటి గిల్లి కజ్జాల కన్నా దేశం బాగుపడే విధంగా నిర్ణయాలు తీసుకుంటే మంచిది. ప్రజలు కూడా హర్షిస్తారు.

## పంటలు గిట్టుబాటు కాక ఆందోళన

### అరటి,మామిడికి దక్కని గిట్టుబాటు

**కడప,జూన్27(పీపుల్స్ మోటివేషన్) :**

ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతులు దళారులచేతుల్లో దగాపడుతున్నా రు. గిట్టుబాటు ధరలు ఉన్నా దళారులు మాత్రం రైతులకు ధరలులేవని మసిపూసి మారేడుకాయ చేస్తున్నారు. దీంతో రైతులు ఉన్న ధరలతోనే సరిపెట్టుకునే దౌర్భాగ్యపు పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులను దళారులు నిలువునా ముంచుతున్నారు. రైల్వేకోడూరులో ప్రధానంగా మామిడి, అరటి, బొప్పాయి తదితర పంటలను సాగుచేస్తున్నారు. ఈఏడాదిలో పకృతివైపరీత్యాలు, చీడపీడలు, దళారులు తదితరవాటితో కోట్లు విలువచేసే అరటి ఏటిపాలు కావడంతో రైల్వేకోడూరు రైతాంగం నిలువునా నష్టపోయింది. అకాల వర్షాలకు కూడా ఉన్నది ఊడ్చుకుపోయిందని వాపోయారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి తదితర మండలాల్లో అరటిచెట్లు పడిపోయాయి. అరటిధరలు బాగా ఉన్న సమయంలో ఇటీవల వర్షం కురిసిచెట్లు నేలకూలిపోయాయి. పక్వానికివచ్చిన గెలలు కళ్లముందే పడిపోవడంతో రైతులు విలవిలలాడారు. బొప్పాయి విషయానికి వస్తే ధరలు పూర్తిగా దళారులదే పెత్తనంగా మారింది. ఇకపోతే దళారులు, వ్యాపారులు కుమ్మక్కై ధరలుపెంచలేదు. మరోవైపు రైతులు దళారులతో తీవ్రంగా నష్టపోతున్నారు. అరటి, బొప్పాయి, మామిడికి ధరలు విషయంలో రైతులకు అనుకూలంగా ఉండాలన్నారు.






## అత్యతంత కఠిన నియమాలకు ప్రతీక వారాహి దీక్ష

### కార్యసిద్ధి కోసం కఠిన నియమాలతో పూజలు
### డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ దీక్షతో సర్వత్రా చర్చ

**అమరావతి,జూన్27(పీపుల్స్ మోటివేషన్):**

డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వేషధారణ, ఆయన ప్రచార రథంపేరు వారాహి కావడంతో ఇప్పుడు వారాహి మాత పేరు మారుమోగిపోతోంది. ఇందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆ అమ్మవారి దీక్షను చేపట్టడం కూడా ఓ కారణంగా చూడాలి. 11 రోజుల పాటు పవన్ వారాహి మాత దీక్షలో ఉన్నారు. ఈ దీక్షలో భాగంగా 11 రోజుల పాటు పవన్ కల్యాణ్ కేవలం పాలు, పండ్లు, ఇతర ద్రవరూప ఆహారం మాత్రమే తీసుకుంటారు. గతేడాది కూడా జూన్ నెలలో పవన్ వారాహి విజయ యాత్ర చేపట్టారు. ఆ యాత్ర సందర్భంగా వారాహి అమ్మకు పూజలు నిర్వహించారు. అప్పట్లో కూడా వారాహి మాత వార్తల్లో నిలిచారు. కాకపోతే ఈసారి డిప్యూటీ సీఎం హోదాలో పవన్ దీక్ష చేపడుతుండటం విశేషంగా చెప్పుకోవాలి. పవన్ కల్యాణ్‌కు దైవభక్తి ఎక్కువే అంటారు. ఆయన అందరికి భిన్నంగా వారాహి అమ్మవారిని పూజిస్తారు. ఎన్నికల ముందు కూడా రాష్ట్ర వ్యాప్తంగా యాత్రకు సిద్ధం చేసుకున్న వాహనానికి కూడా వారాహి అని పేరు పెట్టారు. ఏపీ ఎన్నికల్లో ఘన విజయం సాధించటంతో ఈ ఏడాది కూడా వారాహి మాత దీక్షను కంటిన్యూ చేస్తున్నారు. గతంలో కూడా పవన్ చాలా దీక్షలు చేపట్టారు. చాతుర్మాస దీక్ష చేశారు. నాలుగు నెలల పాటు ఈ దీక్షలో పవన్ కొనసాగారు. ఆషాడం, శ్రావణం, భాద్రపదం, ఆశ్వీజం మాసాల్లో పవన్ దీక్ష చేపట్టారు. ఆ దీక్షలో కూడా ఆహార నియమాలు పాటించారు. సాత్వికాహారం మాత్రమే తీసుకునేవారు. దీక్ష విరమించే సమయంలో హోమం కూడా నిర్వహించారు. ఇంతకీ వారాహి మాత దీక్ష ఏమి ఆశించి చేస్తారు? ఎలా చేస్తారు?



ఎవరు చేస్తారు? వీటి గురించి తెలుసుకుందాం.. మనో అభీష్టాలను నెరవేర్చే వారాహి అమ్మవారు అత్యంత శుభ ఫలితాలను ఇస్తారు. జూన్ నెలాఖరుతో మొదలై జూలై 9 వరకు అమ్మవారి గుప్త నవరాత్రులు ముగుస్తాయి. ఈ సమయం గురించి ఎక్కువగా ప్రచారంలో లేదు. చాలా తక్కువ మందికి మాత్రమే ఈ విషయం తెలుసు. మన సంప్రదాయంలో ఉన్న నాలుగు నవరాత్రుల్లో అత్యంత మహిమాన్వితమైనవి, శక్తిమంతమైనవి ఈ ఆషాఢ మాస గుప్త నవరాత్రులు. ఎవరైతే ఈ నవ రాత్రులు అత్యంత నిష్ఠతో, శ్రద్ధతో దీక్ష ఆచరిస్తారో వారి సమస్యలన్నీ అమ్మవారి అనుగ్రహంతో తీరిపోతా యనేది పెద్దల విశ్వాసం. సప్తమాతృకలలో వారాహి మాత ఒకరు. ఈమె లలితా పరమేశ్వరి సర్వ సైన్యాధ్య క్షురాలు. మహాలక్ష్మి ప్రతిరూపం, సర్వ మంగళ స్వరూపం. దుష్ట శిక్షణ, శిష్ఠ రక్షణకు అమ్మవారు ఆయుధాలు ధరించి ఉంటారు. చూడటానికి ఉగ్రరూపంగా కనిపించినప్పటికీ ఆమె చాలా కరుణామయి. అయితే వారాహి ఆరాధన అందరూ చేయకూడదన్న అపోహ ఉండటం వల్ల చాలా మందికి వారాహి మాత గురించి పెద్దగా తెలియదు. కానీ ఇది సత్యదూరం.ఎవరైనా వారాహి మాతను పూజించవచ్చు.

అరిషడ్వర్గాలు అమ్మ అధీనంలో ఉంటాయి. కామ,క్రోధ, మద, మోహ, మాత్సర్యాల నుంచి అమ్మవారు మనల్ని రక్షిస్తుందని అనుభవజ్ఞుల మాట. మన మనస్సును నియంత్రిస్తుంది. వారాహి మాత భూదేవి నాగలిని, రోకలిని ధరించిన ధాన్య దేవత కూడా. పంటలు సరిగా పండాలన్నా, వ్యవసాయం అనుకూలించాలన్నా ప్రతి రైతు వారాహి మాత ఆరాధాన చేయాలని చెబుతారు. వారాహి మాత దీక్ష శ్రద్ధతో చేసిన వారికి వారు కోరుకున్నవన్నీ జరుగుతాయి. భూ సమస్యలు పరిష్కారమవుతాయి. భూ తగాదాలు, కోర్టు కేసులు, శత్రు సమస్యలు, తీవ్ర అనారోగ్య సమస్యలు, జీవితంలో స్థిరత్వం లేకున్నా. మనకు రక్షణ కావాలన్నా, ఇంట్లో తరచూ అశుభాలు జరుగుతున్నా, ఆర్థిక స్థిరత్వం లేకున్నా, అప్పుల బాధల నుంచి విముక్తి పొందాలన్నా వారాహి మాత దీక్ష చేస్తే చాలు ఎలాంటి సమస్య అయినా ఇట్టే పరిష్కారం అయిపోతుందంటారు. వారాహి మాత దీక్ష చేపట్టేవారు రోజూ ఉదయాన్నే లేచి తలస్నానం చేశాక దీక్షా వస్త్రాలు ధరించాలి. అలా వీలు కాని వారు మెడలో దీక్షగా ఒక కండువాను తొమ్మిది రోజుల పాటు ధరించాలి. నిత్యం వారాహి మాత అష్టోత్తర నామాలు, కానీ సహస్ర నామాలు కాని చదువుతూ అమ్మవారికి కుంకుమార్చన చేయాలి. ఎర్రటి పూలతో పూజించాలి. దానిమ్మ గింజలను నైవేద్యంగా పెట్టాలి. దీక్షలో ఉన్నన్ని రోజులు పాదరక్షలు ధరించరాదు. మద్య,మాంసాలకు దూరంగా ఉండాలి, బ్రహ్మచర్యం పాటించాలని, నేలపైనే చాప పరిచి పడుకోవాల్సి ఉంటుందని పండితులు పూజా క్రతువును వివరించారు. ఆచరించటానికి మాత్రం ఇది కాస్త కఠినంగానే ఉంటుంది. అయితే అమ్మవారి అనుగ్రహం పొందటానికి ఈ మాత్రం చేయగలగాలన్న ధృడచిత్తం కావాలి. మన పురాణాల్లోని సప్తమాతృకల్లో వారాహి మాత ధైర్యం, నిర్భయతకు గుర్తుగా చూస్తారు. వారాహి మాతను ధ్యానించడం లేదా ఆరాధించటం ద్వారా సి÷-ది పొందవచ్చని అంటారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
శుక్రవారం । జూన్ । 28 । 2024


# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి





**ఈఓపిఆర్‌డి, శ్రీనివాసశర్మ**

**నంద్యాల/రుద్రవరం, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్):-**

గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఈవో పీఆర్డి శ్రీనివాస శర్మ తెలిపారు. గురువారం అయిన మండలంలోని నరసాపురం గ్రామంలో ని పలు కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు నిలువచేరి అందులో దోమలు వృద్ధి చెందుతాయి అన్నారు. దోమల వల్ల మలేరియా, డెంగు, టైఫాయిడ్, తదితర వ్యాధులు వస్తాయన్నారు. అలాగే నీరు కలుషితం కావడంవల్ల అతిసార వ్యాధి వస్తుందన్నారు. ప్రజలు గ్రామాలలో ఎక్కడైనా నీరు నిలువ ఉంటే అందులో దోమలు వృద్ధి చెందకుండా వేస్ట్ ఆయిల్ బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. అలాగే పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలన్నారు. త్రాగు నీటిని కాచి వడబోసి తాగాలన్నారు. నిద్రించే సమయంలో దోమతెరలను తప్పనిసరిగా వాడాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు పరిశుభ్రత పాటించడం లేదన్నారు. విద్యార్థులు భోజన సమయంలో సబ్బుతో రెండు చేతులు శుభ్రంగా కడిగించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. నరసాపురంలోని అన్ని పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. మార్తమా పాఠశాలలో మంచినీటి సరఫరా ట్యాంకులను స్కూలు యాజమాన్యం శుభ్రం చేయించడం లేదని వెంటనే శుభ్రం చేయించాలని యాజమాన్యానికి సూచించామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కూడా నీటి సరఫరా ట్యాంకులను శుభ్రంగా కడిగించాలన్నారు. ప్రతి శుక్రవారం ఆయా గ్రామపంచాయతీలలో కార్యదర్శిలు డ్రైడే పాటించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# గౌరు చరితారెడ్డితోనే పాణ్యం అభివృద్ధి





**కర్నూలు, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్):-**

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డిని గురువారం ఫోటోగ్రాఫర్స్ కల్లూరు మండలం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. అనంతరం అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న చిత్రాన్ని ఫోటో ఫ్రేమ్ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గ అభివృద్ధి గౌరు చరితారెడ్డితోనే సాధ్యమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గౌరు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# శ్రవణ్ శాస్త్రి సేవలు భేష్






**ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం**
**అవార్డు గ్రహీతను సన్మానించిన పాత్రికేయులు**

**నెక్కొండ, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్):-**

గ్రామ స్థాయిలో పుట్టి పెరిగినప్పటికీ పట్టుదలతో ఆధ్యాత్మిక ,వేద జ్యోతిష రంగాలలో ముందుకు సాగుతూ నెక్కొండ కు చెందిన బూరుగుపల్లి శ్రవణ్ శాస్త్రి ఇంటర్నేషనల్ ఆస్ట్రో ఎక్సలెన్స్ అవార్డు అందుకోవడం గర్వకారణమని నెక్కొండ ఎస్ఐ మహేందర్ అన్నారు. ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నెక్కొండ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు గ్రహీత శ్రవణ్ శాస్త్రిని పాత్రికేయులు ఘనంగా సన్మానించారు. బొకే, మెమొ%శీ%టోలు అందించి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ ముఖ్యఅతిథిగా హాజరై శ్రవణ్ శాస్త్రి కి బోకే అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు. దక్షిణాది కంటే ఉత్తర భారతంలో వేద జ్యోతిషానికి అధిక ప్రాచుర్యం ఉందని గుర్తు చేశారు. ఉత్తరాది వారితో తెలంగాణ వాసులు పోటీపడి ముందుకు సాగడం అభినందనీయమన్నారు. వేద జ్యోతిషంలో పరిశోధనలు అరుదుగా సాగుతున్నాయని, వేద విద్య పండిత పామరులకు మరింత చేరువ కావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బివియన్ శాస్త్రి గౌరవ అధ్యక్షుడు గిరగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మునిగే ప్రభాకర్, కోశాధికారి రామారపు రాము, సంయుక్త కార్యదర్శులు సంగని మధు, ఎలికట్టే శ్రీనివాస్, పాత్రికేయ మిత్రులు దాసరి శ్రీనివాస్, పలుసం పూర్ణచందర్, శ్యామ్, హేమచందర్, శ్రీనివాస్, సురేష్, అశోక్, సైదులు, రాజనారాయణ అరుణ్, గందే రాజు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డ ఎమ్మెల్యేను కలిసిన శిరివెళ్ళ మండల నాయకులు

**- శిరివెళ్ల మండల అభివృద్ధికి కృషి చేయాలని వినతి**



**శిరివెళ్ల, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్):-**

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియరెడ్డి, భూమా విఖ్యాత్ రెడ్డి, భార్గవ్ రామ్ లను శిరివెళ్ల మండల నాయకులు బుధవారం కలిశారు. బొకే అందజేసి శుభాకంక్షలు తెలియజేశారు. కలిసిన వారిలో శిరివెళ్ల మండల నాయకులు శ్రీకాంత్ రెడ్డి వీర రెడ్డి పల్లె టిడిపి నాయకులు కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, ఇతర నాయకులు తదితరులు ఉన్నారు. శిరివెళ్ల మండల, గ్రామ అభివృద్ధి పై చర్చించారు. అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే శిరివెళ్ల మండల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తోట శ్రీనివాసులు, అప్రి రెడ్డి, కృష్ణారెడ్డి టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర సహాయ మంత్రి ఎస్.పి సింగ్ బగేల్‌ను కలిసిన కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు



**కర్నూలు, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్):-**

కేంద్ర మత్స్య, పశు సంవర్ధక , పాడి పరిశ్రమ మరియు పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఎస్.పి సింగ్ బగేల్ ను కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు మర్యాద పూర్వకంగా కలిసారు.. ఢిల్లీలోని బగేల్ నివాసంలో ఆయనను కలిసిన నాగరాజు శాలువా కప్పి సత్కరించారు.. ఈ సందర్భంగా ఎం.పి నాగరాజు కర్నూలు జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలిని కేంద్ర సహాయ మంత్రి బగేల్ ను కోరారు.. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రామకృష్ణ, మద్దిలేటిలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

**కొత్తగూడెం, జూన్ 27(పీపుల్స్ మోటివేషన్) :**

చర్ల మండల కలివేరు గ్రామ సమీప తోగుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మేడువాయి కాలనీకి చెందిన వృద్ధురాలు గద్దల లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. కాలి నడకన వస్తున్న వృద్ధురాలు లక్ష్మీని వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో ఆమెను హుటాహుటిన సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి 108 ద్వారా తరలించారు.

## ప్రైవేటీకరణకు సహకారం మానుకోకాలి

**పినపాక, జూన్ 27(పీపుల్స్ మోటివేషన్):**

మణుగూరు సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని అధికారులు పరోక్షంగా ప్రైవేటీకరణకు అందిస్తున్న సహకారం మానుకోవాలని ఏఐటీయుసీ మణుగూరు బ్రాంచి సెక్రటరీ వై. రాంగోపాల్ అన్నారు. పీవీ కాలనీలోని కెఎల్ మహేంద్ర భవన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఆపరేటర్లు లేరని ఉత్పత్తి పై ప్రభావం పడుతుందని అధికారులు తప్పుడు సంకేతాలను ఉన్నతాధికారులకు ఇస్తున్నారని అన్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# ప్రజలు, ప్రభుత్వం పరస్పర అంగీకారంతో రోడ్ల విస్తరణ



**ఆర్.అండ్.బి శాఖ అధికారులతో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ నియంత్రణపై మంత్రి సమీక్ష**
**మంత్రి టి.జి భరత్**

**కర్నూలు, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్):-**

ప్రజలు, ప్రభుత్వం పరస్పర అంగీకారంతో నగరంలో రోడ్ల విస్తరణ చేపట్టనున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ తెలిపారు. కర్నూలు నగర ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వ అతిథిగృహంలో ఆర్ అండ్ బి శాఖ అధికారులతో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్‌పై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన సర్కిల్ అయిన రాజ్ విహార్‌లో ట్రాఫిక్ కష్టాలు తీవ్రంగా ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం ఆనంద్ థియేటర్ ఎదురుగా ఉన్న హంద్రి బ్రిడ్జి వద్ద నుండి వాహనాలు మళ్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అవసరమైతే ఫ్లై ఓవర్, అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించేందుకు స్టడీ చేయాలన్నారు. దీంతోపాటు రాజ్‌విహార్ జంక్షన్‌ను విస్తరించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. కోర్టు భవనాలతో పాటు జడ్జిల నివాసాలు ఏ స్థితిలో ఉన్నాయో పరిశీలించి అవసరమైన మరమ్మత్తులు వెంటనే చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను కూడా పరిశీలించి మరమ్మతులు చేయాలన్నారు. ఇక చిల్డ్రన్స్ పార్క్ నుండి వడ్డెగేరి, ఉస్మానియా కాలేజీ మీదుగా బుధవారపేట, కలెక్టరేట్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలన్నారు. ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలు, దుకాణాదారులతో మాట్లాడి తగిన నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రజలు, ప్రభుత్వం పరస్పర అంగీకారంతో నగరంలో రోడ్డు విస్తరణ జరగాలని ఆదేశించారు. దీంతోపాటు కర్నూలు నుండి కల్లూరుకు వెళ్లే మార్గంలో ఉన్న వక్కెర వాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు స్టడీ చేయాలన్నారు. బళ్లారి చౌరస్తా వద్ద ట్రాఫిక్ నియంత్రణకు హైదరాబాద్ నుండి వచ్చే వాహనాలను ఎస్.ఏ.పీ క్యాంపులో వచ్చే విధంగా పరిశీలించాలని మంత్రి టి.జి భరత్ అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు వేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్.అండ్.బి ఎస్.ఈ ఎస్.ఈ నాగరాజు, ఈఈలు సురేష్ బాబు, క్రిష్ణారెడ్డి, డి.ఈలు నాగరాజు, శివరుద్ర, రవిచంద్ర, వెంకటేశ్వర్లు, ఫణిరామ్, సుజాత, రుక్మిణి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# కేంద్రంపైనే పోలవరం ఆశలు

**ఏలూరు, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్) :**



పోలవరం ప్రాజెక్ట్ ఏపీకి జీవనాడి, ఇది దశాబ్దాల కల. క్లిష్టమైన డిజైన్ అంతకు మించి సవాళ్లతో కూడిన నిర్మాణం. అనుమతులు.. డిజైన్లు, నిధులు పేరుతో ఏళ్లకేళ్లు గడిచిపోతూనే ఉన్నాయి. అరవై ఏళ్లుగా ఈ ప్రాజెక్టు చర్చల్లోనే ఉంది. రాష్ట్ర విభజన పుణ్యమా అని ప్రాజెక్టుకు జాతీయ హోదా వచ్చింది. 2014-19 మధ్య నిర్మాణం పరుగులు పెట్టినా..అత్యంత కీలకమైన సహాయ, పునరావాసంపై మాత్రం పీటముడి పడిపోయింది. జాతీయ ప్రాజెక్టు హోదా ఇచ్చినా తాము డ్యామ్ నిర్మాణానికే నిధులిస్తామని సహాయ, పునరావాసం తమ బాధ్యత కాదని వాదించింది. తర్వాత అంచనాలను తగ్గించేసింది. ఇలాంటి సమస్యలతో వైసీపీ హయాంలో ఐదేళ్లు ఆగిపోవడంతో.. అనేక సమస్యలు వచ్చాయి. ఇప్పుడు వచ్చే మూడు, నాలుగు సీజన్లలో డ్యామ్ పూర్తి చేసినా... నీళ్లు నిలపాలంటే.. సహాయ, పునరావాసం పూర్తి చేయాల్సి ఉంటుంది. అలా చేయాలంటే కేంద్రం నుంచి సహకారం రావాల్సిందే. మరి కేంద్రం అందుకు సిద్ధంగా ఉందా ? ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం 2013 సెక్షన్ 90(1) ప్రకారం పోలవరంకు జాతీయ హోదా వచ్చింది. సెక్షన్ 90(4) ప్రకారం, నిర్మాణ బాధ్యత పూర్తిగా కేంద్రానిదే అని స్పష్టంగా పేర్కొన్నారు. కేంద్రం పర్యవేక్షణ చేస్తే ఎప్పటికి పూర్తవుతుందో చెప్పడం కాబట్టి.. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో నిర్మిస్తే నిధులు రీఎంబర్స్ చేసేలా ఒప్పంద చేసుకున్నారు. మొదట్లో ట్రాన్స్ ట్రాయ్, ఆ తర్వాత నవయుగ కంపెనీల ఆధ్వర్యంలో పనులు జరిగాయి.జగన్ ప్రభుత్వం కాంట్రాక్టర్లను మార్చి మిగలిన పనులు మేఘ కంపెనీని అప్పగించింది. కానీ ఆ సంస్థ పనులు వేగంగా చేపట్టడంలో విఫలమయింది. అనేక సమస్యలు వచ్చాయి. పోలవరం ప్రధాన డ్యాం పనులు ఇప్పటికే 78 శాతం పనులు పూర్తి అయ్యాయి. అత్యంత కీలకమైన ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్‌డ్యామ్ నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే కొట్టుకుపోయి ప్రధాన డ్యామ్ నిర్మాణానికి ఆటంకంగా ఉన్న డయా ఫ్రమ్ వాల్ నిర్మాణంపై ఓ నిర్ణయానికి రావాల్సి ఉంది. డయాఫ్రం వాల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు ఎంతవరకు భద్రంగా ఉన్నాయో తేల్చాలి. డయాఫ్రం వాల్ కొత్తగా నిర్మించాలనే ప్రతిపాదన ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. గోదావరిలో మట్టి స్వభావం వల్ల నది మధ్యలో స్పిల్ వే నిర్మించే అవకాశం లేదు. దీంతో నది ప్రవాహమార్గాన్ని మార్చి, కొండలు ఉన్నచోట ఊళ్లన్నీ ఖాళీ చేయించి, అక్కడ స్పిల్ వే నిర్మించారు. గోదావరి మధ్యలో ప్రధాన డ్యాం నిర్మించాలి. ఆ కట్ట దిగువన డయాఫ్రం వాల్ విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. ప్రధాన డ్యాం నిర్మించేందుకు వీలుగా ప్రవాహాన్ని మళ్లించేందుకు ఎగువన, దిగువన కాఫర్ డ్యాంలు నిర్మించారు. ప్రాజెక్టులోనే ప్రాజెక్టులోనే అత్యంత కీలక కట్టడం డయాఫ్రం వాల్. చంద్రబాబు హయాంలో విదేశీ కంపెనీ బావర్‌తో ఈ పనులు చేయించారు. నదీగర్భంలో 70 మీటర్ల లోతు నుంచి ఈ కట్ ఆఫ్ వాల్ నిర్మించాల్సి వచ్చింది. జగన్ హయాంలో ఈ నిర్మాణాన్ని వరదల నుంచి రక్షించలేకపోయారు. ఎగువ కాఫర్ డ్యాంలో ఉన్న గ్యాప్‌లను సకాలంలో పూడ్చుకపోవడంతో 2020 వరదలకు ఈ డయాఫ్రం వాల్ ధ్వంసమైంది. మళ్లీ డయాఫ్రం వాల్ నిర్మించుకోవాలి. ఇందుకు రెండు సీజన్ల సమయం పడుతుంది. ఆపైన మళ్లీ ప్రధాన డ్యాం నిర్మించాలి. అంటే ఎంత లేదన్నా ఐదేళ్లు పడుతుంది. పోలవరం సవరించిన అంచనాలను చంద్రబాబు హయాంలో రూ.55,656 కోట్లకు కేంద్ర జలసంఘం ఆమోదించింది. తర్వాత రివైజ్డ్ కాస్ట్‌కమిటీ రూ.47,725,74 కోట్లకు సిఫార్సు చేసింది. ఆ నిధులకు ఇంతవరకు కేంద్రం ఆమోదించలేదు. మరోవైపు జగన్ హయాంలో తొలిదశ నిధులు అంటూ 41.15 మీటర్ల స్థాయి పునరావాసాన్ని, భూసేకరణను పరిగణనలోకి తీసుకుని, కట్టడాల కాలువల విషయంలో యథాతథ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని రూ.31,625 కోట్లకు కేంద్ర జలసంఘం సిఫార్సు చేసింది. ఆ నిధులతో పోలవరం పూర్తిచేయడం సాధ్యం కాదు. తమకు పరిహారం చెల్లించకుండానే బలవంతంగా ముంపు ప్రాంతాల నుంచి తరలించే ప్రయత్నాలు చేస్తున్నారంటూ జాతీయ ఎస్టీ కమిషన్‌కు గిరిజనులు ఫిర్యాదుచేశారు. దీనిపై 15 రోజుల్లో సమాధానం చెప్పాలని సీఎస్‌ను తాజాగాఎస్టీ కమిషన్ ఆదేశించింది. ప్రాజెక్టులో పూర్తి సామర్థ్యంతో 196టీఎంసీలు నిల్వ చేయాలంటే 45.72 మీటర్ల కాంటూరు మేరకు భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాలను పూర్తి చేయాల్సి ఉంది. ఇందుకోసం 85,136 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. 53,192 ఎకరాల భూమి సేకరించి పరిహారం చెల్లించాల్సి ఉంది. ఇందుకోసం రూ. ఏడు వేల కోట్లు వ్యయమవుతాయని అంచనా. ఈ మొత్తం మున్ముందు మరింత పెరిగే అవకాశాలూ ఉన్నాయి. నిర్వాసితులు కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వాలని కోరితే.. భూముల విలువ అమాంతం పెరిగిపోతోంది. పునరావాస గృహాల నిర్మాణానికి రూ.12,88 కోట్లు ఖర్చుచేయాలి. అంటే రాష్ట్రప్రభుత్వం రూ.26 వేల కోట్లకుపైగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. 41.15 మీటర్ల కాంటూరులో 115టీఎంసీల నిల్వకే పరిమితం చేయాలని గత ప్రభుత్వం అనుకుంది. కానీ అలా చేస్తే అది బహుళార్థక సాధక ప్రాజెక్టుగా కాక..త సాదాసీదా ఎత్తిపోతలగా మిగిలిపోతుంది. పోలవరం వంటి ప్రాజెక్టు పూర్తయితే.. ఒక్క ఏపీకి మాత్రమే లాభం ఉండదు. దేశానికి అదో పెద్ద ఆస్తి అవుతుంది. నదుల అనుసంధాన మహా యజ్ఞంలో అతి పెద్ద ముందడుగు పడినట్లవుతుంది. అతి పెద్ద బహుళార్థక సాధక ప్రాజెక్టు అవుతుందని కేంద్రమే అనేక సార్లు చెప్పింది. అందుకే ప్రాజెక్టు పూర్తయ్యేలా కేంద్రం సహకరిస్తుందని ఆశతో ఉన్నారు. లేకపోతే అంచనాలు పెరిగిపోతూ పోవడమే తప్ప.. దాని వల్ల కలిగే ప్రయోజనాలు ఎప్పటికి వస్తాయో అంచనా వేయడం కష్టం.

## నెల్లూరు సెంట్రల్ జైల్‌కి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

**నెల్లూరు, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్) :**

ఈవీఎంల ధ్వంసం కేసులో అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డిని పోలీసులు నెల్లూరు జైలుకు తరలించారు.గురువారం ఉదయం 8.50 కి జైల్ లోకి తరలించారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. నంబూరి శేషగిరి రావు పై దాడి, కారంపూడి సిఐ నారాయణ స్వామిపై దాడి కేసుల్లో పిన్నెల్లికి రిమాండ్ విధంచారు.పిన్నెల్లిని పోలీసులు మాచెర్ల నుంచి పిన్నెల్లిని ఉదయం నెల్లూరుకు తరలించారు ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా సెంట్రల్ జైల్ వద్ద భద్రత పెంచారు. బారికేడ్లని ఏర్పాటు చేసారు.

## ఆలూ లేదు...చూలు లేదు...

**కాంగ్రెస్ లో ముఠాలు, గ్రూపులు**



**విజయవాడ, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్) :**

ఆంధ్రప్రదేశ్ ను సుదీర్ఘకాలంగా పాలించింది కాంగ్రెస్ పార్టీ. కానీ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో ఆ పరిస్థితి మారింది. టిడిపి హవా ముందు కాంగ్రెస్ నిలవలేకపోయింది. టిడిపి ఏర్పడిన తొమ్మిది నెలల కాలంలోనే అధికారంలోకి రాగలిగింది. దేశంలోనే తెలుగుదేశం పార్టీ ప్రాంతీయ పార్టీలకు దిక్సూచిగా నిలిచింది. అయితే అదే తెలుగుదేశం పార్టీని మట్టి కరిపించింది కాంగ్రెస్ పార్టీ. కానీ రాష్ట్ర విభజన పుణ్యమా అని కాంగ్రెస్ పార్టీ ఈ రాష్ట్రంలో సోది లేకుండా పోయింది. కనీసం ఉనికి చాటుకోలేకపోతోంది. ఈ ఎన్నికల్లో రాజశేఖర్ రెడ్డి కుమార్తె షర్మిల ద్వారా బలపడాలని భావించింది. కానీ బలం పెంచుకోలేకపోయింది. వైసిపి పతనంతో బలపడాలనుకున్న కాంగ్రెస్ పార్టీ ఆశలు నీరుగారిపోయాయి. వైసిపి పతనం వరకు ఓకే కానీ.. కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో ఉనికి మాత్రం చాటుకోలేకపోయింది.1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. పార్టీ ఏర్పాటు చేసిన తొమ్మిది నెలల కాలం లోనే ఆ పార్టీ అధికారంలోకి రాగలిగింది. అప్పటినుంచి కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందులు ప్రారంభం అయ్యాయి. 1985లో నాదెండ్ల భాస్కరరావు రూపంలో కాంగ్రెస్ పార్టీ టిడిపిని నిలువరించే ప్రయత్నం చేసింది. కానీ నందమూరి తారక రామారావు ప్రజాభిప్రాయాన్ని కోరుతూ ఎన్నికలకు వెళ్లారు. అంతులేని ప్రజామోదంతో అధికారంలోకి రాగలిగారు. కానీ 1989 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓటమి గురికాక తప్పలేదు. అయితే 1994 ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి వచ్చింది తెలుగుదేశం పార్టీ. 1995లో టిడిపిలో సంక్షోభం ఎదురైనా.. 1995 ఎన్నికల్లో చంద్రబాబు సర్కార్ విజయం సాధించింది. 2004లో రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని హస్తగతం చేసుకుంది. 2009 ఎన్నికల్లోనూ తెలుగుదేశం పార్టీకి చుక్కెదురు అయ్యింది.రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో వైసీపీ ఆవిర్భవించింది. కాంగ్రెస్ పార్టీ స్థానంలో ఉనికి చాటుకునే ప్రయత్నం చేసింది. 2014లో ప్రతిపక్షం స్థానానికి పరిమితమైన వైసీపీ.. 2019 ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. ఐదేళ్లపాటు అధికారాన్ని చక్కబెట్టింది. కాంగ్రెస్ పార్టీని పాతాళంలోకి తొక్కింది. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వైసిపి నీడన ఉన్న రాజశేఖర్ రెడ్డి కుమార్తె కాంగ్రెస్ పార్టీలో చేరారు. అధికార పార్టీగా ఉన్న వైసీపీకి ఎదురెళ్లి వెళ్లారు. సోదరుడు జగన్ నాయకత్వాన్ని సవాల్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున బలమైన అభ్యర్థులను బరిలో దించడం ద్వారా వైసీపీని నిలువరించే ప్రయత్నం చేశారు. కానీ ఆ పార్టీ సాధించిన ఓట్లు అంతంత మాత్రమే. మెజారిటీ సర్వేలు కాంగ్రెస్ పార్టీ ఒకటి రెండు సీట్లు సాధిస్తుందని చెప్పినా.. ఓట్లు, సీట్లు పరంగా ఆ పార్టీ సాధించినవి అంతంత మాత్రమే. 40% ఓట్లు సాధించిన వైసీపీతో సవాల్ చేసిన కాంగ్రెస్ పార్టీకి ఐదు శాతం మించి ఓట్లు రాలేదు. కానీ వైసీపీని గద్దెదించామన్న సంతోషంతో కాంగ్రెస్ పార్టీ గడిపేస్తోంది. ఒక విధంగా చెప్పాలంటే తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చేందుకు షర్మిల నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఎంతగానో దోహద పడిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కానీ ఆ పార్టీకి దక్కిన ఓట్లు మాత్రం అంతంత మాత్రమే. కేవలం వైసీపీ ఓటమితో తాము బలపడం అన్న ఆలోచనలో కాంగ్రెస్ పార్టీ ఉండడం విశేషం.

## బీజేపీ అగ్రనేత ఎల్కే ఆడ్వానీకి అస్వస్థత

**- ఏయిమ్స్ ఆస్పత్రికి తరలింపు**

**న్యూఢిల్లీ, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్) :**

బీజేపీ అగ్రనేత, మాజీ ఉప ప్రధాని ఎల్కే ఆడ్వానీ అస్వస్థతకు గురయ్యారు. దాంతో అయనను బుధవారం రాత్రి హుటాహుటిన ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందనీ, వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. 96ఏళ్ల ఆడ్వా నీ కి యూరాలజీ విభాగానికి చెందిన వైద్యులు చికిత్స అందిస్తున్నట్టు సమాచారం. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఆసుపత్రి అధికారులు,అద్వానీ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి అద్వానీ ఆరోగ్య పరిస్థితిని కనుక్కున్నారు.

## అవుల లారీని అడ్డుకున్న భజరంగ్ దళ్ కార్యకర్తలు

**నర్సాపురం, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్) :**

తూర్పు గోదావరి జిల్లా నుంచి అవులతో చెన్నై వెళ్ళుతున్న లారీని పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం లో భజరంగ్ దళ్, ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు నిలిపారు.ఒకే లారీలో సుమారు 24 ఆవులు, దూడలను ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. సమాచారం అందుకున్నడీఎస్పీ గంటి శ్రీనివాసరావు అక్కడికి సిబ్బందితో చేరుకున్నారు. ఆవుల రవాణా అనుమతిపత్రాలను పరిశీలించారు. అనుమతి పత్రాలపై సంతకాలు ఉన్న అధికారులకు ఫోన్ చేసిమాట్లాడి అనుమతి ఉన్నట్లు నిర్ధారించారు. ఆవులకు నీరు తాగించి తీసుకువెళ్లాలనిభజరంగదళ్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తల సూచన మేరకు ఆ లారీని గోశాల వద్దకు తీసుకు వెళ్లారు.నరసాపురం డీఎస్పీ చొరవతో ఆవుల రవాణా వ్యవహారంలో ఏర్పడిన సమస్య పరిష్కారమైంది.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
శుక్రవారం | జూన్ | 28 | 2024



# వర్కౌట్ అయిన సోషల్ ఇంజనీరింగ్

**కాకినాడ, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్) :**

అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ సోషల్ ఇంజనీరింగ్ మంచి ఫలితాలను ఇచ్చింది. మంత్రి వర్గ విస్తరణలో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన శెట్టిబలిజ కులానికి చెందిన వాసంశెట్టి సుభాష్‌కు మంత్రి పదవి దక్కింది. అమలాపురంకు చెందిన ఈయన అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం నుంచి గెలుపొందారు.. తొలి సారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సుభాష్‌కు మంత్రి పదవి దక్కింది. ఆయన టీడీపీకి దూరమైన శెట్టిబలిజల్ని దగ్గరకు చేర్చడంలో కీలక పాత్ర పోషించారు. బీసీ ఉపకులాల్లో ఒకరైన శెట్టిబలిజ కులస్తులు టీడీపీ ఆవిర్భావం నుంచి టీడీపీ వెంట నడిచిన వారే. అయితే మెల్లగా మారిపోయారు. గత 20 ఏళ్లుగా వీరిలో ఎక్కువ శాతం మంది అప్పట్లో కాంగ్రెస్ వెంట నడిచారు. రాష్ట్ర విభజన తరువాత ఏర్పడ్డ వైఎస్సార్ సీపీ వెంట నడిచారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి అత్యంత వీరాభిమానులు శెట్టిబలిజ వర్గంలోని పెద్దలు చాలా మంది ఉన్నారని చెబుతారు.. ఆయన మరణానంతరం ఆయన కుమారుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వెంటే ఎక్కువ శాతం మంది నడిచారు..ఉభయగోదావరి జిల్లాలో ఎక్కువగా ఉన్న శెట్టిబలిజ కులాన్ని ప్రసన్నం చేసుకునేందుకు వైసీపీ ప్రభుత్వంలో కూడా పెద్దపీట వేసిన పరిస్థితి ఉంది.. ఈ క్రమంలోనే రామచంద్రపురం నియోజకవర్గం నుంచి తొలిసారి గెలిచిన చెల్లుబోయిన గోపాలకృష్ణకు మంత్రి పదవిని కట్టబెట్టింది. ఆ తరువాత ఎమ్మెల్సీ పదవుల కేటాయింపులో అమలాపురంకు చెందిన శెట్టిబలిజ కుల నాయకుడు కుడిపూడి సూర్యనారాయణరావుకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టింది. ఇంతవరకు బాగానే ఉన్నా శెట్టిబలిజ కులంలో కులం పేరు చెప్పి కొంత మందే పదవులు పొందుతున్నారు కానీ దిగువ క్యాడర్‌కు అన్యాయమే చేసిందని అసంతృప్తి వ్యక్తమయింది. దీనికి తోడు బీసీలకు వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసిందన్న వాదన బలంగా వినిపించడంతో అనూహ్యంగా శెట్టిబలిజ కులస్తులు కూడా క్రమక్రమంగా పార్టీకు దూరమవుతూ కనిపించింది. ఉభయగోదావరి జిల్లాల్లో అత్యధికంగా ఉన్న కాపులు, శెట్టిబలిజలు ఒక్కటవ్వాలన్న నినాదం జనసేన అధినేత పవన్ కల్యాణ్ చాలా సారు వారాహి సభల వేదికగా అనేక సార్లు పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడ్డాక ఈ నినాదంకు మరింత బలం చేకూరింది.. వైసీపీపై తీవ్ర అసంతృప్తిలో ఉన్న చాలా మంది శెట్టిబలిజ ద్వితీయశ్రేణి నాయకత్వం టీడీపీలోకి చేరింది.. ఈ మార్పే 2024 ఎన్నికల్లో కాపులు, శెట్టిబలిజలు ఏకమై కూటమి గెలుపులో కీలకంగా పనిచేసిన పరిస్థితి కనిపించింది...అమలాపురం అల్లర్లులో కేసుల్లో ఇరుక్కున వారు ఎక్కువ మంది కాపులు, శెట్టిబలిజలు కావడంతో వీరు ఆసంఘటన నుంచి కలిసే ఉంటున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆ తరువాత ఈ కేసుల్లో కొందరు అమాయకులు బలి అయ్యారని నష్ట నివారణ చర్యలు చేపట్టిన వైసీపీకు తిరిగి ఆ నష్టం మాత్రం పూడ్చులేని పరిస్థితి ఏర్పడింది.. శెట్టిబలిజ యూత్ ఫోర్స్ కన్వీనర్‌గా ఉన్న ప్రస్తుత కార్మికశాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్, కాపు నాయకుడు గంధం పళ్లంరాజులు మధ్య ముందు నుంచి ఉన్న స్నేహం ఈ రెండు వర్గాలను కలపడంలో ప్రధాన భూమిక పోషించిందని చెప్పాలి. రామచంద్రాపురంలో స్థానికుడు కాకపోయినా కూటమి తరపున బరిలో దిగిన వాసంశెట్టి సుభాష్‌ను ప్రధానంగా కాపు, శెట్టిబలిజ సామాజికవర్గాల కలయిక మంచి మెజార్టీతో గెలుపొందేలా చేసింది.. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీ జయహో బీసీ సదస్సులు పేరిట నిర్వహించిన కార్యక్రమంలో శెట్టిబలిజ వర్గాలకు పెద్దపీట వేయడంతో మరింత జోష్ పెరిగి టీడీపీ వైపు మళ్లేలా చేసిందని విశ్లేషకులు చెబుతున్నారు.. ఈ జోష్ కూటమి గెలుపుకు మరింత బలాన్ని చేకూర్చిందంటున్నారు.. ఈ ఎన్నికల్లో కూటమి భారీ విజయంలో కాపు, కమ్మ సామాజికవర్గాల కాంబినేషన్ ఎంతటి సక్సెస్‌ను ఇచ్చిందో ఉభయగోదావరి జిల్లాల్లో కాపు, శెట్టిబలిజ కాంబినేషన్ కూడా అంతే సూపర్ హిట్ అయ్యిందని విశ్లేషకులు చెబుతున్నమాట. బలమైన సామాజికవర్గంలో ఒకట్కైన శెట్టిబలిజ వర్గంలో అత్యధికశాతం టీడీపీ వైపుకు మళ్లడం మాత్రం వైసీపీకు చాలా నష్టాన్నే మూటగట్టిందని మాత్రం స్పష్టం అవుతుందంటున్నారు..

# ట్విట్టర్ వార్...

**విజయవాడ, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్) :**

పచ్చ కామెర్ల వాడికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది అన్నట్టు ఉంది వైసీపీ తీరు అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.అనుమతులు లేకుండా కట్టిన పార్టీ ఆఫీసులకి, అనుమతులతో కట్టిన రాష్ట్ర పార్టీ ఆపీసుకు తేడాలేదా అంటూ నెటిజన్స్ మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మంత్రి నారా లోకేష్ పై వైసీపీ కీలక నేత, మాజీమంత్రి పేర్ని నాని ట్విట్టర్ వేదికగా స్పందించారు.'నారా లోకేష్ నువ్వు పిల్లాడిగా ఉన్నప్పుడు మీ నాన్న హైదారాబాద్ లో కట్టించిన పార్టీ ఆఫీస్ ఏంటి ఇది పూరిపాక, రేకుల షెడ్డా లేదంటే ఒకే గది ఉన్న స్లాబా.. దీని చరిత్ర ఏంటి? ఈ పార్టీ ఆఫీస్ స్థలాన్ని ట్రస్ట్ కి బదిలీ చేసుకున్నారు రెగ్యులరైజ్ కూడా చేసుకున్నారు.. 2019 ఎన్నికలకు వెళ్ళే నెల ముందు జనవరిలో కూడా 3 ఆఫీసులకి స్థలం లీజుకి తీసుకున్నారు.' అంటూ టీడీపీ ఆపీస్ ఫోటో షేర్ చేశారు.పేర్ని నాని ట్వీట్‌కు టీడీపీ ఘాటుగా స్పందించింది. 'వైఎస్ జగన్ నువ్వు పదో తరగతిలో లాగులు వేసుకునే టైంలో, ప్రశ్నాపత్రాలు దొంగతనం చేసి దొరికిపోయావు. నీ స్నేహితులు చక్కగా చదువుకుని బాగుపడ్డారు. నువ్వు మాత్రం ఘరానా దొంగవి అయ్యావు. నీకు, నీ స్నేహితులకు ఎంత తేడా ఉందో, మేము అనుమతులతో కట్టిన రాష్ట్ర పార్టీ ఆఫీసుకు, నువ్వు అనుమతులు లేకుండా, అక్రమంగా, కబ్జా చేసి, ప్రజల డబ్బుతో, 26 జిల్లాల్లో కట్టిన 26 ప్యాలెస్‌లకు అంత తేడా ఉంది.' అంటూ టీడీపీ మండిపడింది. కాగా ఈ పోస్టులు చూసిన నెటిజన్స్ వైసీపీపై మండిపడుతున్నారు.పేర్ని నాని పోస్టుపై నెటిజన్స్ మండిపడుతున్నారు. టీడీపీ అవినీతి అక్రమాలకు పాల్పడిందని ఇప్పుడు గగ్గోలు పెడుతున్న వైసీపీ నేతలు, అధినేత అధికారంలో ఉండగా ఎందుకు నోరు మెదపలేదు..? అనుమతులతో కట్టిన, ప్రజలకు ఉపయోగకరమైన ప్రజా వేదికను కూల్చినప్పుడు, అనుమతులు లేని పార్టీ ఆపీసుపై ఎందుకు చర్యలు తీసుకోలేదు..? అని ప్రశ్నిస్తున్నారు. అలానే నాడు మాట్లాడకుండా మౌనంగా ఉన్న మీరు నేడు మాట్లాడుతున్నారంటే.. టీడీపీపై వైసీపీ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని తమకు అర్థం అవుతుందని, కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబుపై బురదజల్లేందుకు మీరు చేస్తున్న ప్రయత్నం వర్థ్యం అని వైసీపీని ప్రజలు నమ్మడంలేదని నెటిజన్స్ తేల్చి చెప్పారు.

# స్వరూపుడి లీలలు...ఇంతింతకాదయా

**విశాఖపట్టణం, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్) :**

హిందూ ధర్మ రక్షణ, ధర్మ ప్రచారం, వేద విద్య.. ఇవీ అధ్యాత్మిక పీఠాల కర్తవ్యం.. శారదా పీఠం కూడా ఇందుకు అతీతం కాదు.. కానీ ప్రస్తుతం ఈ పీఠం పెద్దల్లో అధ్యాత్మిక భావన కంటే వాణిజ్యకోణాలే ఎక్కువ కనిపిస్తున్నాయన్న ఆరోపణలు మొదలయ్యాయి. గత ప్రభుత్వ పెద్దలను అడ్డుగా పెట్టుకొని దేవుడి పేరు చెప్పుకొని అక్రమార్జన చేశారన్న ఆరోపణలు రోజురోజుకు పెరుగుతున్నాయి.. ఇంతకీ ఏంటీ శారదపీఠం కథ.. ? వారిపై వస్తున్న ఆరోపణలేంటి?స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి.. విశాఖ శారదాపీఠం అధిపతి.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ వెలుగు వెలిగిన స్వామిజీ.. స్వరూపానందేంద్ర.. అయితే ఆ సమయంలో ఎంత పేరు వచ్చిందో.. ఇప్పుడు అంతకంటే ఎక్కువ వివాదాలను ఎదుర్కొంటున్నారు. కారణం ఆ పీఠం దక్కించుకున్న భూములు.. వారికున్న పొలిటికల్ లింక్స్.. ఇంతకీ వివాదం ఏంటంటే.. వైసీపీ హయాంలో శారదా పీఠానికి ప్రభుత్వం భారీగా భూములు కేటాయించింది. విశాఖలో వేద పాఠశాల ఏర్పాటు కోసం శారదాపీఠం భూమిని కోరింది. కోరింది స్వరూపానందేంద్ర.. అధికారంలో ఉంది శిష్యుడు జగన్.. ఇంకేముంది ఎకరం మూడు కోట్లు విలువ చేసే భూమిని కేవలం లక్ష రూపాయల చొప్పున 15 ఎకరాల భూమిని కేటాయించింది. అంటే 45 కోట్ల విలువైన భూమిని.. 15 లక్షలకు కేటాయించింది. భీమిలి బీచ్‌కి సమీపంలోని సర్వే నెంబరు 102,103లో ఈ 15 ఎకరాల భూమి ఉంది.ఇక్కడి వరకు బాగానే ఉంది. స్వామి స్వరూపానంద సరస్వతికి మేలు చేయడం కోసం 15 ఎకరాల భూమికి సమీపంలో %ఎవీ=ణూ%కు 50 ఎకరాలు కేటాయించింది ప్రభుత్వం.. ఆ 50 ఎకరాల భూమి అభివృద్ధి పేరుతో శారదాపీఠానికి కేటాయించిన భూమికి సమీపంగా రోడ్లు డెవలప్ కూడా చేశారు. అంటే ఇన్‌డైరెక్ట్‌గా %ఎవీ=ణూ% నిధులతో శారదాపీఠం స్వామివారికి ప్రత్యేక రోడ్లు.. మౌలిక వసతులు కల్పించింది జగన్ ప్రభుత్వం. మరి ఈ కేటాయింపులు అక్కడితో ఆగిపోయాయా? లేదు.. భీమిలిలో సముద్ర సమీపంలో ఒకచోట..అమరావతిలో యాగం చేసిన ప్రదేశానికి సమీపంలో మరోచోట.. ప్రకాశం జిల్లాలో ఇంకోచోట.. తిరుపతి, తిరుమలలో రెండు చోట్ల భూములను కేటాయించింది జగన్ ప్రభుత్వం. సో మొత్తంగా చూసుకుంటే వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా ల్యాండ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసుకుంది శారదాపీఠం.ఇక తిరుమల విషయానికి వద్దాం.. తిరుమలలో ధర్మ పరిరక్షణ పేరుతో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో నిర్మాణాలు చేపడుతుంది శారదాపీఠం.. అయితే ఈ నిర్మాణాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తుందన్నది ఆరోపణలు. వడ్డించేవాడు మనవాడైతే.. పంక్తిలో ఎక్కడ కూర్చున్న పర్వాలేదన్నట్టుగా.. ఇన్నాళ్లు ఈ అక్రమాలను చూసి కూడా చూడనట్టుగా వదిలేసింది తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు పెద్దలు.. ఏ బ్లాక్‌లో నిర్మాణాలకు పర్మిషన్ తీసుకున్నది నాలుగు అంతస్తులకు నిర్మించింది ఐదు అంతస్థులు. ఇదే విషయంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు తిరుమల క్షేత్ర రక్షణ సమితి అధ్యక్షుడు ఓంకార్.. హైకోర్టు పిటిషన్‌పై విచారణ చేసి కమిషన్ ఏర్పాటు చేయడం.. ఆ కమిషన్ విచారణ చేపట్టడం.. ఆ విచారణలో అక్రమాలు బయటపడటం.. ఇలా వరుసగా జరిగిపోయాయి. అసలు ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండానే నిర్మించడం ఓ తప్పైతే.. ఊట కాలువను పూడ్చించి మఠము వెనుక రహదారి వైపు నిర్మించడం మరో తప్పు.. ఇదీ తిరుమల కథ.విశాఖలో గత ప్రభుత్వంలో ఇచ్చిన విలువైన భూములను కొత్త ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కోట్ల విలువైన భూములను స్వామిజీకి ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు. అయితే.. ప్రభుత్వం ఇచ్చిన భూములను వెంటనే వెనక్కి తీసుకోవాలి.. అదే మా డిమాండ్ అంటూ క్లియర్ కట్‌గా చెప్తున్నారు. అసలు శారదపీఠం ఆస్తులు ఈ ఐదేళ్లలో ఎందుకు గణనీయంగా పెరిగాయి? ఎలా పెరిగాయి? దీని వెనకున్నది ఎవరు? అనేది తేల్చాలన్న డిమాండ్ కూడా వినిపిస్తుంది. మొత్తంగా చూసుకుంటే శారదాపీఠం ఇప్పుడు వివాదాలకు కేరాఫ్‌గా మారింది. మరి ప్రభుత్వం వీటిపై ఫోకస్ చేస్తుందా? త్వరలోనే విచారణ జరిపి.. ఇచ్చిన భూములను వెనక్కి తీసుకుంటుందా? ఈ ప్రశ్నలకు సమాధానం త్వరలోనే రానుంది.

# శివన్నగూడెం ప్రాజెక్టు ముంపు బాధితుల అందోళన

**నల్గొండ, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్) :**

నల్లగొండ జిల్లా, మునుగోడు అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలోని.. శివన్నగూడెం ప్రాజెక్టు ముంపు బాధితులు మరోసారి ఆందోళన బాట పట్టారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా.. ముంపు గ్రామమైన నర్సిరెడ్డిగూడెం కి భూనిర్వాసితులకు కొందరికి నష్టపరిహారం ఇవ్వకుండానే ఊరికి వెళ్లే దారిని తెంచేసి రాకపోకలకు బంద్ చేశారు. కాంట్రాక్టర్లు, అధికారుల తీరుకు నిరసిస్తూ.. ప్రభుత్వ పనితీరును తప్పు పడుతూ.. ప్రాజెక్టు పనులను అడ్డగించారు బాధితులు. ఈ క్రమంలో.. పోలీసుల సమక్షంలో ప్రాజెక్టు %ఇజు% కాశీం వచ్చి.. వచ్చే వారం రోజుల పాటు రాకపోకలకు అంతరాయం కలగ కుండా రోడ్డును తవ్వమని హామి ఇవ్వటంతో గ్రామస్తులు శాంతించారు. అయితే.. బాధిత నర్సిరెడ్డిగూడెం గ్రామానికి వెళ్లే రొడ్డును తవ్వేశారు. అధికారులు స్వయంగా హామీ ఇచ్చారని.. మళ్ళీ యధావిధిగా పనులు చేసి తమ గ్రామంలోకి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు.

# జగన్ పై సెటైర్లు..

**విజయవాడ, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్) :**

ఎక్కువ ఎంపి స్థానాలు ఇవ్వండి. కేంద్రం మెడలు వంచి ఈ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా తీసుకొస్తాను. ఏపీ రూపురేఖలే మార్చేస్తాను.. 2019 ఎన్నికలకు ముందు వైసీపీ అధినేత జగన్ తరచూ చేసిన ప్రకటన ఇది. ప్రజలు 22 మంది ఎంపీలను ఇచ్చారు. అయినా కేంద్రం మెడలు వంచలేదు. తిరిగి వంగి వంగి దండాలు పెడుతూ వారికే మద్దతు ఇచ్చారు జగన్. పార్లమెంట్ లోని రెండు సభల్లో సైతం.. ఈ సందర్భంలోనైనా బిజెపికి జై కొట్టారు. నిర్ణయాలు, బిల్లులు, జాతీయ అంశాలు.. ఇలా ఒకటేంటి అన్నింటికీ తమ మద్దతును తెలియజేశారు. కానీ గత ఐదు సంవత్సరాలలో కేంద్రానికి తన అవసరం వచ్చినప్పుడు ప్రత్యేక హెూదా మెలిక పెట్టలేదు జగన్.ఎన్నికల్లో బిజెపితో పొత్తు పెట్టుకుంది తెలుగుదేశం పార్టీ. మూడు పార్టీలు కలిసి వెళ్లాయి. ఘనవిజయం సాధించాయి. కానీ గత ఐదేళ్లుగా ప్రత్యేక హెూదా తెస్తానని చెప్పిన జగన్ ఎన్నడూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయలేదు. తన అవసరం వచ్చినప్పుడు షరతులు విధించలేదు. కానీ ఇప్పుడు టిడిపి మెజారిటీ ఎంపీ స్థానాలు గెలిచేసరికి.. ప్రత్యేక హెూదా తేవాలంటూ సెటైర్లు వేయడం మాత్రం కొంచెం అతిగా ఉంది. తాను చేయలేని పనిని.. మీరైనా చేయండి అని చెబితే బాగుండేది. కానీ తన అసమర్థతను కప్పిపుచ్చుకొని.. టిడిపి పై ప్రత్యేక హెూదా బురద చల్లేందుకు జగన్ వేసిన ఎత్తుగడగా తెలుస్తోంది.కేంద్ర పెద్దలు వైసీపీని ఆశ్రయించారు. తాము నిలబెడుతున్న స్పీకర్ అభ్యర్థికి మద్దతు తెలపాలని కోరారు. పెద్దలు అడిగింది తడవుగా ఓకే చెప్పారు జగన్. తమ మద్దతు ఎప్పుడూ ఎన్డీఏకు ఉంటుందని ఏకంగా లిఖితపూర్వకంగా కూడా తెలియజేశారు. మరి ఇప్పుడు ప్రత్యేక హెూదా ఇవ్వాలని కోరారా? ఆ షరతుతోనే మద్దతు తెలిపారా? అని టిడిపి సెటైర్లు వేయడం ప్రారంభించింది. ఎన్డీఏ పూర్తి మెజారిటీ ఉంది. 290 మంది ఎంపీలతో మ్యాజిక్ ఫిగర్ కు దాటింది. కానీ అది మిత్రుల మద్దతుతో. అందులో 16 మంది సభ్యులతో టిడిపి కీలకంగా ఉంది. ఒక విధంగా చెప్పాలంటే బిజెపి తర్వాత పెద్ద పార్టీ టిడిపి. కానీ బేషరతుగా వైసీపీ మద్దతు ప్రకటించింది. మొన్నటికి మొన్న ఎన్డీఏలో టిడిపి చేరితే ప్రత్యేక హెూదా అడగొచ్చు కదా అని వైసిపి సూచించింది. ఇప్పుడు అదే వైసిపి బిజెపి స్పీకర్ అభ్యర్థికి మద్దతు తెలపడంతో ప్రత్యేక హెూదా గురించే కదా.. అంటూ టిడిపి ప్రశ్నిస్తోంది. ఇలా రెండు పక్షాలకు ప్రత్యేక హెూదా ప్రధాన ఇష్యూ కావడం గమనార్హం.

టీడీపీ అలెర్ట్...

ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. తాజా ఎన్నికల్లో జగన్ పై ఎన్డీఏ కూటమి విజయం సాధించింది. ఇప్పుడు అదే ఎన్డీఏ కు జగన్ మద్దతు తెలిపారు. ఎన్డీఏ లో కీలక భాగస్వాములుగా చంద్రబాబుతో పాటు పవన్ ఉన్నారు. స్పీకర్ ఎన్నికలకు సంబంధించి ఎన్డీఏకు పూర్తి మెజారిటీ ఉన్నా.. బిజెపి మాత్రం వైసీపీ మద్దతు కోరింది. వెంటనే జగన్ సైతం ఓకే చెప్పారు. అసలు ఏపీ విషయంలో మోదీ వ్యూహం ఏంటన్నది తెలియడం లేదు. మూడు ప్రాంతీయ పార్టీలను తన చెప్పు చేతుల్లోకి తీసుకోవడం ఆసక్తికర పరిణామంగా మారింది. ఏపీలో వైసీపీకి నలుగురు పార్లమెంట్ సభ్యులు ఉన్నారు. వారు స్పీకర్ ఎన్నికల్లో ఎన్డీఏ నిలిపిన అభ్యర్థికి ఓటు వేయనున్నారు. ఎన్డీఏకు పూర్తి మెజారిటీ ఉంది. 293 మంది సభ్యుల బలం ఉంది. కానీ బిజెపి నాయకత్వం మాత్రం నలుగురు సభ్యులు ఉన్న వైసీపీ మద్దతును కోరింది. 2019 నుంచి ఐదేళ్ల పాటు జగన్ కేంద్రం విషయంలో ఎలా నడుచుకున్నది అందరికీ తెలిసిన విషయమే. కేంద్రానికి అవసరమైన ప్రతిసారి జగన్ మద్దతు తెలుపుతూ వచ్చారు. ఎన్డీఏలో టిడిపి, జనసేన ఉండడంతో స్పీకర్ ఎన్నికల్లో వైసిపి ఎలా వ్యవహరిస్తుంది అన్నది చర్చగా మారింది. కానీ బిజెపి నుంచి మద్దతు కావాలని ప్రతిపాదన రావడం.. దానికి జగన్ ఓకే చెప్పేయడం జరిగిపోయింది. లోక్సభలో వైసిపి పార్లమెంటరీ నేత మిథున్ రెడ్డితో బిజెపి నేతలు చర్చించారు. వెంటనే ఆయన జగన్ తో చర్చలు జరిపారు. ఎన్డీఏకు మద్దతు ఉంటుందని ప్రకటన కూడా వచ్చింది.ఎన్డీఏకు సంపూర్ణ మెజారిటీ ఉండగా.. వైసీపీ మద్దతు కోరడం ఏమిటన్న ప్రశ్న ఇప్పుడు ఉత్పన్నమవుతోంది. అసలు ఏపీ విషయంలో మోడీ ఏం ఆలోచిస్తున్నారన్న ప్రశ్న వినిపిస్తోంది. ఎన్డీఏలో భాగస్వాములుగా ఉండగా.. బిజెపి వైసిపి మద్దతు కోరడంపై టిడిపి, జనసేనలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మొన్నటికి మొన్న ప్రమాణ స్వీకార మహెూత్సవంలో చిరంజీవి, పవన్ ను తీసుకొని వచ్చి మరి ప్రధాని మోదీ అభివాదం చేయించారు. ఇప్పుడు మొన్నటి ఎన్నికల్లో ఎవరిపై పోరాడారో.. అదే జగన్ ను ఇప్పుడు మద్దతు కోరారు. దీని వెనుక వ్యూహం ఏదైనా ఉందా అన్న అనుమానాలు టిడిపిలో ఉన్నాయి. అయితే దీనిపై చంద్రబాబు అలెర్ట్ అయినట్లు తెలుస్తోంది. ఎన్డీఏ సుస్థిరతను దెబ్బతీయాలని ఆలోచన చేస్తున్న ఇండియా కూటమికి అవకాశం ఇవ్వకూడదని మోడీ భావిస్తున్నారు. అందుకే సభలో తమ బలాన్ని చూపే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగానే చంద్రబాబుతో పాటు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలను సంప్రదించిన తర్వాతే.. ప్రధాని మోదీ వైసిపి మద్దతు కోరినట్లు తెలుస్తోంది.


# ఉచిత రవాణా హామీపై చంద్రబాబు సర్కార్ దృష్టి



**విజయవాడ, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్) :**

ఏపీలో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం హామీల అమలు దిశగా అడుగులు వేస్తోంది. సూపర్ సిక్స్ లోని మహిళలకు ఉచిత రవాణా హామీ పై చంద్రబాబు సర్కార్ దృష్టి సారించింది. కుప్పం పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు కుప్పం ఆర్టీసీ బస్టాండు, డిపో ఆధునీకరణ పనులకు ఆదేశించారు. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి కుప్పంలో ఆర్టీసీ కొత్త బస్సులను ప్రారంభించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సు అమలు చేస్తున్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో పరిస్థితిని అధ్యయనం చేస్తామన్నారు.లోటుపాట్లను గుర్తించి ఏపీలో పకడ్బందీగా అమలు చేస్తామని చెప్పారు మంత్రి రాంప్రసాద్ రెడ్డి. వైసీపీ నేతలు ఆర్టీసీ స్థలాలు దోచుకున్నారన్న ఆరోపణలపై విచారణ జరుగుతోందన్నారు మంత్రి రాంప్రసాద్ రెడ్డి. ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూస్తామన్నారు. కుప్పం బస్టాండ్, డిపో ఆధునీకరణకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 5 కొత్త బస్సులను ప్రారంభించారు. సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనకు రావడంతో సుమారు 30 బస్సులు కుప్పం డిపోకు వచ్చాయన్నారు.గత ప్రభుత్వం ఏ శాఖను వదల్లేదని విమర్శించారు మంత్రి రాంప్రసాద్. 5 ఏళ్లలో ఎన్ని వీలైతే అన్ని విద్యుత్ బస్సులు తీసుకొస్తామన్న మంత్రి ప్రభుత్వంలో ఏపీఎస్ ఆర్టీసీని 100 శాతం విలీనం చేసేందుకు కృషి చేస్తామన్నారు. డిజల్ రేట్స్ తగ్గినా బస్సు చార్జీలను పెంచిన ఘనత గత ప్రభుత్వానిది అంటూ విమర్శించారు. జగన్ మాటలను ప్రజలు వినే పరిస్థితి లేదని అన్నారు. రాజకీయ పార్టీల సభలకు ఆర్టీసీ బస్సుకు ఫ్రీగా వాడమన్నారు మంత్రి రాంప్రసాద్.

# రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకున్న మంత్రి వాసంశెట్టి



**కోనసీమ, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్) :**

రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామం సెంటర్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైన దంపతులను సరిగ్గా అదే సమయానికి అటువైపు వెళుతున్న రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ తమ కాన్వాయ్ ను ఆపి వారిని తమ కారులో రామచంద్రపురం ఏరియా హాస్పిటల్ కి హుటాహుటిన తరలించారు. క్షతగాత్రులకు తక్షణమే తగిన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# రాహుల్ ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ


**ఫిరాయింపులకు ఆద్యుడే కేసీఆర్**
**61మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను చేర్చుకున్నారు**
**పార్లమెంటులో బీజేపీకి ఓటేయించిన ఘనులు**
**ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోంది**
**జీవన్‌రెడ్డి అంశంతో రాజకీయంగా లబ్ధిపొందాలని చూశారు**
**మంత్రివర్గ విస్తరణపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు**
**ఢిల్లీలో మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి**



**న్యూఢిల్లీ,జూన్27(పీపుల్స్ మోటివేషన్):**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయబోతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా మంచి విజయాలు సాధించానని చెప్పారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అనుభవాన్ని కాంగ్రెస్ పార్టీ వినియోగించుకుంటుందని అన్నారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్ మాట్లాడారు. పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతికత కేసీఆర్‌కు లేదని, దానికి పునాది వేసింది కేసీఆరే అని అన్నారు. గతంలో 61 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఆయన లాక్కున్నారు. ఆ విషయం ఆయనకు గుర్తులేదా? ఫిరాయింపులను ప్రోత్సహించినందుకు కేసీఆర్ క్షమాపణలు చెప్పాలి.. ముక్కు నేలకు రాయాలి. మా ప్రభుత్వం వచ్చిన నెలరోజుల్లోనే కూలిపోతుందని కేటీఆర్,హరీశ్‌రావు అన్నారు. వారి మాటలకు అప్పట్లో భాజపా వంతపాడింది. ప్రభుత్వాన్ని కూలగొడతామని భారాస, భాజపా రంకెలేశాయి. ప్రభుత్వాన్ని పడగొట్టాలనుకోవడమే కేసీఆర్ భావదారిద్య్రమని అన్నారు. ఇప్పటికీ ఆయనకు కనువిప్పు కలగలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో భారాస ఓటింగ్ 16శాతానికి తగ్గింది. కాంగ్రెస్‌ను ఓడించేందుకు లోక్‌సభ ఎన్నికల్లో భాజపాను కేసీఆర్ గెలిపించారు. కంచుకోట గా చెప్పుకొనే మెదక్‌లో భారాస మూడో స్థానంలో నిలిచింది. సిరిసిల్ల, సిద్దిపేటలో భాజపాకు అన్ని ఓట్లు పడ్డాయంటే అర్థమేంటని ప్రశ్నించారు. ఇన్నాళ్లూ ఎమ్మెల్యేలను దగ్గరకు రానివ్వని కేసీఆర్ ఇప్పుడు ఫామ్‌హౌస్ తలుపులు తెరిచారు. రాష్ట్రావతరణ దినోత్సవాలకు కేసీఆర్‌ను ఆహ్వానించాం. అక్కడ మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. విద్యుత్ కొనుగోళ్లపై విచారణ కోరింది భారాస ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డే. విచారణ కమిషన్ కేసీఆర్‌కు లేఖ రాయగానే విచారణ ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రావతరణ వేడుకల్లో విపక్ష నేత మాట్లాడే సంప్రదాయం ఉందా?గతంలో మాకు కనీసం ఆహ్వానం కూడా లేదని రేవంత్‌రెడ్డి అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ చేరికతో గందరగోళం నెలకొందని,ఇప్పుడు అంతా సర్దుకుందని.. పరిస్థితి చక్కబడిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఇంకా ఖరారు కాలేదని సీఎం తెలిపారు. విద్యాశాఖ తన పరిధిలోనే ఉందని, అన్ని పరీక్షలు సవ్యంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. శాఖలకు మంత్రులు లేరనడం సరికాదన్నారు. మంత్రులు నిరంతరం సమీక్షలు చేస్తున్నారని, జీవన్‌రెడ్డి వల్ల కాంగ్రెస్‌కు నష్టం జరగాలని.. గుంట నక్కలు ఎదురు చూస్తున్నాయని, ప్రత్యర్థుల ఆశలు నెరవేరలేదని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జీవన్‌రెడ్డి అలక అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని ప్రతిపక్షాలు చూశాయి. కాంగ్రెస్ పట్ల ఆయనకున్న నిబద్ధత వారికి అర్థం కాదు. సీనియర్ నేత అయిన ఆయన సేవలను పార్టీ వినియోగించుకుంటుంది. పీసీసీ అధ్యక్షుడి పదవీ కాలం మూడేళ్లు. కొత్త అధ్యక్షుడిని నియమించమని అధిష్ఠానానికి ఇదివరకే చెప్పాను. మంత్రివర్గ విస్తరణ గురించి ఎక్కువగా ప్రచారం చేస్తున్నారు. అన్ని శాఖలకు సమర్థమైన మంత్రులు ఉన్నారు. విద్యాశాఖ నా పరిధిలోనే ఉంది. ఇప్పటివరకు అన్ని పరీక్షలు సవ్యంగానే నిర్వహించా. నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళుతున్నాం. కేసీఆర్ ఒక్కరే ప్రమాణస్వీకారం చేసి మంత్రులను నియమించకపోయినా ఆనాడు మీడియా ప్రశ్నించలేదు. కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ప్రయత్నిస్తున్నాం. రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తాం. బడ్జెట్‌లో నిధుల కోసం కేంద్ర మంత్రులను కలుస్తున్నాం. త్వరలో ప్రధాని మోదీని, కేంద్ర హోంమంత్రిని కలుస్తాం. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో రాష్ట్రాభివృద్ధే మా ధ్యేయం. తెలంగాణ ప్రజలకు రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయబోతున్నాం. ఆనాడు సోనియా గాంధీ తెలంగాణ ఇస్తానని చెప్పి ఆ వాగ్దానాన్ని నెరవేర్చారు. రాష్ట్రంలో ఎలాంటి ఘటనలు జరగకుండా ఎన్నికలు పూర్తయ్యాయి. దానిపై విమర్శించడానికి భారాసకు అవకాశం లేకుండా పోయింది. శాంతిభద్రతలను కాపాడుకుంటూ ముందుకు వెళ్తున్నాం. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌తో ఎలాంటి సమస్యలు లేవు. ఏమైనా ఉంటే పరిష్కరించుకోవడానికి సిద్ధంగా ఉన్నాం.ఫామ్ హౌస్‌లో పడుకోవడానికి తాను కేసీఆర్‌ని కాదని, క్యాలెండర్ డేట్ ప్రకారం నిర్దిష్టంగా ముందుకు వెళ్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యాశాఖ మీద అనేక రివ్యూలు చేశామని, ఏ ఒక్క శాఖ ఖాళీగా లేదని అన్ని శాఖలకు మంత్రులు ఉన్నారని, సమర్థవంతంగా పని చేస్తున్నారని చెప్పారు. కేంద్రంలో అన్ని శాఖల మంత్రులను కలుస్తున్నామని, బీజేపీ పాలిత ప్రాంతాల ప్రభుత్వాలు కూడా కేంద్రాన్ని కలవలేదని రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్‌కు ఓట్లు వేయకపోతే ప్రజల తప్పు అన్నట్టు కెసిఆర్ మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి వేయించారని ఆరోపించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కులగొట్టాలని చూస్తున్నారంటూ కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేసుకొని కేంద్రం నుంచి రావాల్సిన అంశాలు...పక్క రాష్టంతో సంబంధాలు కొనసాగిస్తామని, రోజుకు 18 గంటలు పని చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యుత్‌పై కమిషన్ తాము ప్రతిపాదించలేదని.. మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అసెంబ్లీలో డిమాండ్ చేశారని, దీంతో రిటైర్డ్ జడ్జితో విచారణకు ఆదేశించామన్నారు. వాళ్లు కమిషన్ అడిగారు.. మేము కమిషన్ వేశామని.. కేసీఆర్ తన వాదనను కమిషన్ ముందు వినిపించుకునే అవకాశం వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో జీవన్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు కూడా పాల్గొన్నారు.

# పోలీస్ వ్యవస్థను దిగజార్చిన గత ప్రభుత్వం







**నిధులు ఇవ్వకుండా నీరసింప చేశారు**
**కేవలం నాయకుల రక్షణకే పోలీసులు ఉపయోగం**
**గంజాయి నిర్మూలన, మహిళల రక్షణ తమ కర్తవ్యం**
**కక్షసాధింపు చర్యలకు తాము ఎప్పుడూ దూరమే**
**పోలీస్ ఉన్నతాధికారులతో హోంమంత్రి అనిత సమీక్ష**

**అమరావతి,జూన్27(పీపుల్స్ మోటివేషన్):**


నిర్దుష్ట ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని, నాలుగు అంశాలను అజెండాగా పెట్టుకున్నామని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గంజాయి నిర్మూలన, మహిళలకు రక్షణ, పోలీసుల సంక్షేమం, పోలీసు శాఖలో నియామకాల భర్తీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. 'రెడ్ బుక్' కక్ష సాధింపు చర్యలకు కాదన్నారు. గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన అధికారులపై చట్టపరంగా చర్యలుంటాయని చెప్పారు. తమకు కక్ష సాధింపు ఉంటే.. ఇంతకాలం ఆగుతామా అని వ్యాఖ్యానించారు. పగ, ప్రతీకారాల ఆలోచన చేయడం లేదని.. తమ నాయకుడు చంద్రబాబు చెప్పిన ప్రకారం రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తామని చెప్పారు. డీజీపీ, ఇతర ఉన్నతాధికారుల తో సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ 12 రోజుల్లో చాలా అంశాలను పరిశీలించా. వైకాపా ప్రభుత్వ హయాంలో పోలీసు వ్యవస్థను నాశనం చేశారు. కేవలం బందోబస్తుకే వాడారు. ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగం కూడా భర్తీ చేయలేదు. పోలీసు అకాడమీ, గ్రేహౌండ్ అకాడమీ లేదు. కేంద్రం నుంచి నిధులొచ్చినా పోలీసు అకాడమీ నిర్మాణం పూర్తిచేయలేదు. నేటికీ విశాఖపట్నం జిల్లాలోని ఓ పోలీస్‌స్టేషన్ రేకుల షెడ్డులోనే నడుస్తోంది. ఎస్కార్ట్ వాహనాలు కూడా పనిచేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. 2014లో ఇచ్చినవే ఇప్పటికీ వాడుతున్నారు. ఠాణాల్లో స్టేషనరీ ఖర్చులకు కూడా గత ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని అన్నారు. గంజాయి రవాణా రాష్ట్రంలో బాగా పెరిగింది. నేషనల్ క్రైం రికార్డులో రాష్ట్రాన్ని మూడో స్థానంలోకి తెచ్చారు. గంజాయి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఇప్పటికే ఉపసంఘం ఏర్పాటు చేశాం. 100 రోజుల ప్రణాళిక ఏ విధంగా అమలు చేయాలనేదానిపై చర్చిస్తాం. ప్రజల భాగస్వామ్యంతోనే గంజాయిని అరికట్టేందుకు వీలుంటుంది. మంచి ఆలోచనతో పనిచేస్తే విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చు. ఎలాంటి శిక్షణ లేకుండా సచివాలయాల్లో మహిళా పోలీసులను పెట్టారు. ఏ విధంగా వారు పోలీసు విధులు చేయగలరు?వారిని ఏ విధంగా వినియోగించాలనేదానిపై ఆలోచన చేస్తున్నామని వివరించారు. కలిసి కట్టుగా పనిచేసి పోలీసుల పనితీరులో మార్పు తెస్తాం. ప్రజలు ధైర్యంగా స్టేషన్‌కు వెళ్లి బాధలు చెప్పుకొనేలా భరోసా ఇవ్వాలి. సిబ్బంది ప్రజలతో మర్యాదగా మెలగాలి. రాష్ట్రంలో ఆడపిల్లల అదృశ్యం ఘటనలు చాలా ఉన్నాయి. ఫిర్యాదులతో ఎవరైనా వస్తే వారిని కించపరిచేలా మాట్లాడవద్దు. పోలీసులు అంటే ప్రతిపక్ష పార్టీ నేతల అరెస్టులకే గత ప్రభుత్వం వినియోగించింది. ఇకపై ఫ్రెండ్లీ పోలీసింగ్ రావాలి. సోషల్ మీడియాలో నేటికీ నేను బాధితురాలినే. కొంతమంది ఐపీఎస్ అధికారుల తీరుతో వ్యవస్థకు చెడ్డపేరు వస్తోంది. గత ప్రభుత్వంలో అక్రమ కేసులు పెట్టారు. నాపైనే 23 కేసులు నమోదు చేశారు. అసభ్య పోస్టులపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. అక్రమ కేసులపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. పోలీసులంటే ప్రజల్లో ఒక నమ్మకం, గౌరవం తీసుకొస్తాం. ఏపీలో దిశ చట్టమే లేదు.. ఇక ఆ స్టేషన్ల పేరు కూడా మార్చే ఆలోచన చేస్తాంఅని హోం మంత్రి తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏడాదికి రూ. 50 కోట్లు చొప్పున రూ.250 కోట్లు పోలీసు శాఖకు రావాలని అన్నారు. ఈ ఐదేళ్లల్లో ఈ నిధులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇప్పుడు జీరో నుంచి తాము పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పేపర్, పెన్ను ఖర్చులకు కూడా గత ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. నిధుల కొరత వల్ల పోలీసులకు విధుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వైసీపీ ప్రభుత్వంలో ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రంలో గంజాయి రవాణాను పోలీసులు నియంత్రణ చేయలేదని, గతంలో సిఐడీ ఎలా పని చేసిందో అందరూ చూశారన్నారు. హోంశాఖకు ఎంత నిధులు అవసరమో ఒక నివేదిక సిద్ధం చేశామని, ప్రాధాన్యత ప్రకారం కేటాయిస్తూ ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. నిధుల కొరత వల్ల ఒకేసారి అన్నీ చేయలేమని చెప్పారు. చాలా చోట్ల సిసి కెమెరాలు, ఫ్రింగర్ ప్రింట్ స్కానర్‌లు పని చేయడం లేదని, వైసీపీ ప్రభుత్వం వాటిని అసలు పట్టించుకోలేదని అన్నారు. విశాఖలో సిపి కార్యాలయం తాకట్టులో ఉందని, ఎప్పుడు అప్పుల వాళ్లు వస్తారో తెలియదన్నారు. చంద్రబాబుపై నమ్మకంతో 164 సీట్లు ప్రజలు ఇచ్చారని, మాకు రాష్ట్రం, ప్రజలే ముఖ్యమని.. వారి కోసం పని చేస్తామని స్పష్టం చేశారు. ఇంకా కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు తాకట్టులో ఉన్నాయన్నారు. పోలీసులు నిబంధనలు మేరకు పని చేయాలన్నారు. రాజకీయాలు కావాలంటే బయటకి వెళ్లి ఖద్దరు వేసుకోవాలని సూచించారు. పోలీసు అంటే ప్రజల కోసం పని చేసే వ్యవస్థ అనేలా పని చేయాలన్నారు. మహిళల మిస్సింగ్ కేసులపై దర్యాప్తు చేస్తామని, ఏపీలో ప్రతిఒక్కరూ భద్రతగా, భరోసాగా ఉండేలా చేస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.

# అభివృద్ధి ప్రణాళికల అమలుపై ప్రత్యేక దృష్టి

**లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలి**
**ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ)పై అధికారులతో కలెక్టర్ డా. జి.సృజన**



**విజయవాడ,జూన్27(పీపుల్స్ మోటివేషన్):**




ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ) కింద కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన జిల్లాలోని ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాల్లో అభివృద్ధి ప్రణాళికల అమలుపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని... సంపూర్ణతా అభియాన్‌లో భాగంగా నిర్దేశిరచిన సూచికల్లో ప్రగతిపై అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డా. జి.సృజన సూచించారు. ÷ఎరువారం న్యూఢిల్లీ నుంచి నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం ఆకాంక్షిత జిల్లాలు, బ్లాక్‌లలో పురోగతిపై ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వర్చువల్ సమావేశానికి కలెక్టర్ సృజన.. అధికారులతో కలిసి కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ గత అక్టోబర్‌లో 100 ఆకాంక్షిత బ్లాకులను ఎంపిక చేయగా.. ఈ జాబితాలో ఎన్‌టీఆర్ జిల్లా నుంచి ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆకాంక్షిత బ్లాక్‌లలో వివిధ సూచికల్లో ప్రగతిపై నీతి ఆయోగ్ సీఈవో సూచనలు చేశారు. అదే విధంగా సంపూర్ణతా అభియాన్ కింద ఆరు సూచికల్లో ప్రగతికి అనుసరించాల్సిన ప్రణాళికపై దిశానిర్దేశర చేశారు. వీసీ అనంతరం కలెక్టర్ సృజన క్షేత్రస్థాయి అధికారులకు సూచనలు చేశారు. ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాల్లో 9 రంగాలు,40 సూచికల్లో ప్రగతికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందించడంలో సమర్థత చూపాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సంపూర్ణతా అభియాన్ చొరవ కింద ప్రధానంగా గర్భిణీల రిజిస్ట్రేషన్, వారికి ఆరోగ్యం పరంగా అవసరమైన సేవలు అందించడం, పోషకాహారం అందించడం; హైపర్ టెన్షన్, మధుమేహం స్క్రీనింగ్, రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అందించడం, ఎస్‌హెచ్‌జీలకు రివాల్వింగ్ ఫండ్ సూచికలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. జులై 1 నుంచి మూడు నెలల పాటు ప్రత్యేకంగా కృషిచేసి ఈ సూచికలకు సంబంధించి 100 శాతం లక్ష్యాలను చేరుకోవాలన్నారు. జులై 4న ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి.. లోగో ఆవిష్కరణ, సెల్ఫీ స్టాండ్‌లు వంటివి ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని కలెక్టర్ జి.సృజన సూచించారు. వర్చువల్ సమావేశంలో సీపీవో వై.శ్రీలత, పెనుగంచిప్రోలు ఎంపీడీవో సాయి హర్ష, ఇబ్రహీంపట్నం ఎంపీడీవో పి.ఉమాదేవి, ఏబీపీ బ్లాక్ కోఆర్డినేటర్ మోహన్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిమ్స్ నుంచి అద్వానీ డిశ్చార్

**న్యూఢిల్లీ,జూన్27(పీపుల్స్ మోటివేషన్):**

తీవ్ర అనారోగ్యంతో ఎయిమ్స్‌లో చేరిన మాజీ ఉప ప్రధాని, భారతరత్న ఎల్ కె అద్వానీ ఆరోగ్యం నిలకడగా ఉంది. ఈ నేపథ్యంలో ఆయన్ని గురువారం ఎయిమ్స్ నుంచి వైద్యులు డిశార్జ్ చేశారు. ఆయన ఆరోగ్యంపై మూత్ర ,గుండె, వృద్ధాప్యంకు సంబంధించిన ప్రత్యేక వైద్య బృందం క్షుణ్ణంగా పరీక్షలు నిర్వహించి.. నివేదికలను పరిశీలించింది. అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్య బృందం స్పష్టం చేసింది. దీంతో ఆయన్ని డిశార్చ్ చేసినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. 96 ఏళ్ల ఎల్ కె అద్వానీ బుధవారం రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ని అల్ ఇండియా మెడికల్ సైన్సెన్స్ ఎయిమ్స్‌లో చేర్చిన సంగతి తెలిసిందే.

# నీట్ లీకేజీపై దర్యాప్తు ముమ్మరం

**బీహార్‌లో ఇద్దరిని అరెస్ట్ సిబిఐ**

**న్యూఢిల్లీ,జూన్27(పీపుల్స్ మోటివేషన్):**

నీట్-యూజీ 2024 పరీక్ష పేపర్ లీక్ కేసు దర్యాప్తును సీబీఐ వేగవంతం చేసింది. దీనికి సంబంధించి అరెస్టులు మొదలుపెట్టింది. ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న మనీశ్ ప్రకాశ్, అశుతోష్‌ను బిహార్‌లోని పట్నాలో అదుపులోకి తీసుకొంది. ఈ కేసులో లీకైన పేపర్‌ను పొందిన విద్యార్థులను మనీశ్ తన కారులోనే తరలించినట్లు గుర్తించారు. వీరిలో రెండు డజన్ల మందికి అతడే ఒక రూమ్ కూడా బుక్ చేసినట్లు తెలుస్తోంది. ఇక రెండో నిందితుడైన అశుతోష్ పేపర్ లీక్‌లో భాగస్వాములైన విద్యార్థులకు తన ఇంట్లోనే ఆశ్రయం కల్పించాడు. ఇప్పటికే పేపర్ లీక్‌కు సంబంధించి సీబీఐ క్రిమినల్ కేసు నమోదు చేసింది. దీంతోపాటు బిహార్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాలు నమోదుచేసిన అభియోగాలను కూడా తమకు బదలాయించాలని నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే గుజరాత్‌లోని గోద్రా తాలుకా పోలీస్‌స్టేషన్‌లో మాల్‌ప్రాక్టీస్‌పై ఓ ఎఫ్‌ఐఆర్ నమోదైంది. సీబీఐ మొత్తం ఈ వ్యవహారంలో ఆరు కేసులను దర్యాప్తు చేస్తోంది. నీట్-యూజీ 2024 పరీక్షను దేశవ్యాప్తంగా మే 5వ తేదీన నిర్వహించింది. దీనికి 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పేపర్ బిహార్, గుజరాత్ రాష్ట్రాల్లో లీకైనట్లు ఇటీవల కాలంలో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ మధ్యలోనే జూన్ 4న ఎన్‌టీఏ ఫలితాలు ప్రకటించడం వివాదాస్పదంగా మారింది. దీంతో కేంద్రం కూడా ఈ వ్యవహారంపై దృష్టి సారించింది.

## దేశాభివృద్ధి ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి

**పదేళ్ల పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టం**
**రిఫార్మ్, పర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ ఆధారంగా ముందుకు**
**మౌలిక వసతులు కల్పలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత**
**వికసిత్ భారత్ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది**
**నీట్, నెట్ పేపర్ లీకేజీపై కొనసాగుతున్న దర్యాప్తు**
**ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం**

**న్యూఢిల్లీ, జూన్ 27 (పీపుల్స్ మోటివేషన్) :**

దేశాభివృద్ధి ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆకాంక్షించారు..పదేళ్ల పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైందని తెలిపారు. రిఫార్మ్, పర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ ఆధారంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పెట్టుబడులు, ఉపాధి కల్పనకు ప్రాధాన్య మిచ్చామని తెలిపారు. 18వ లోక్‌సభ తొలి సమావేశాల నాలుగోరోజు ఆమె పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి మాట్లాడారు. గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు.. రానున్న ఐదేళ్లలో ప్రభుత్వ ప్రాధాన్యతలను ఆమె తన ప్రసంగంలో వివరించారు. మొదటగా ఆమె కొత్తగా గెలిచిన ఎంపీలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ ప్రజల విశ్వాసం గెలిచి లోక్‌సభకు ఎన్నికయ్యా రన్నారు. ప్రజల ఆకాంక్షలను ప్రతి సభ్యుడు నెరవేరుస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రథమ కర్తవ్యంగా ఎంపీలు పనిచేయాలన్నారు. ప్రజల సుస్థిరతకు పట్టాం కట్టారని.. విశ్వమంతా దేశంలో జరిగిన ఎన్నికలను పరిశీలించిందన్నారు. తమ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందుకెళ్తోందన్నారు. అభివృద్ధిలో తమ ప్రభుత్వం పరుగులు పెడుతుందని రాష్ట్రపతి పేర్కొన్నారు. మౌలిక వసతలు కల్పలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తోందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని.. రైతలు?, మహిళలు, యువత సాధికరత దిశగా ప్రభుత్వం పయనిస్తోందన్నారు. సిఏఏ ప్రకారం శరణార్థులకు ప్రభుత్వం పౌరసత్వం మంజూరు చేయడం ప్రారంభించిందని తెలిపారు. ప్రజా స్వామ్యాన్ని కించపరిచే ప్రతి ప్రయత్నాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. దేశ ఖ్యాతిని దిగజార్చేలా ఎవరూ వ్యవహరించకూడదని అన్నారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నామన్నారు. 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ ఆయుష్మాన్ భారత్ కింద ఉచిత ఆరోగ్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. గతంలో తీసుకొచ్చిన ఎన్నో సంస్కరణలతో దేశంలో ఎన్నో మార్పులు తీసుకురాగలిగామని చెప్పారు. జీఎస్టీ ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో వాణిజ్యం, వ్యాపార కార్యకలాపాలు సులభతరమయ్యాయన్నారు. దేశ ప్రజలు సుస్థిరతకు పట్టం కట్టారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. ప్రజలు ప్రభుత్వ సుస్థిరత, నిజాయతీని నమ్మారని అన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. పంటలకు మద్దతు ధరకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. వ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకువచ్చామని.. ప్రజాక్షేమం కోసం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నామని.. రైతుల సంక్షేమం కోసం అతి పెద్ద నెట్‌వర్క్ ఏర్పాటు చేసినట్లు రాష్ట్రపతి పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీకి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, రాబోయే రోజుల్లో అడవుల విస్తరణ ఉంటుందన్నారు. ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్‌తో దేశ ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పిస్తున్నామని, చిన్న రైతులకు పీఎం సమ్మాన్ నిధి ఏర్పాటు చేసినట్లు రాష్ట్రపతి తన ప్రసంగంలో పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైందని, పెట్టుబడులు, ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాలను ప్రజలు విశ్వసించారని.. ఆర్గానిక్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగిందని రాష్ట్రపతి తెలిపారు. ప్రపంచవ్యాప్త డిమాండ్ మేరకు భారత్ ఉత్పత్తులు అందిస్తోందన్నారు. ఆరోగ్య రంగంలో భారత్ అగ్రగామిగా ఉందని తెలిపారు. తమ దేశం వేగంగా పురోగతి సాధిస్తోందన్నారు. దేశంలో పేపర్ లీకేజీ ఘటనలపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందించారు. నీట్, నెట్ పేపర్ లీకేజీపై ఆమె తన ప్రసంగంలో మాట్లాడుతూ.. దర్యాప్తు కొనసాగుతుంద న్నారు. పేపర్ లీకేజీపై నిష్పక్షపాతంగా విచారణ జరుగుతోందన్నారు. నిందితులపై చర్యలు తప్పవన్నారు. పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించడం ప్రభుత్వ జవాబుదారీతనాన్ని తెలియజేస్తుందన్నారు. అలాగే దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఆరు దశాబ్దాల తర్వాత దేశంలో సంపూర్ణ మెజారిటీతో సుస్థిర ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజలు మూడోసారి విశ్వాసం చూపించారని తెలిపారు. ప్రతి భారతీయుడి ఆకాంక్షలను ఈ ప్రభుత్వం నెరవేర్చగలదని రాష్ట్రపతి తెలిపారు. 18వ లోక్‌సభ అమృత కాలం ప్రారంభ సంవత్సరాల్లో ఏర్పడిందన్నారు. త్వరలోనే ఈ ప్రభుత్వం తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుందని తెలిపారు. ఈ బడ్జెట్ ప్రభుత్వ ఆర్థిక విధానాలను తెలియజేయడంతో పాటు అనేక కీలక నిర్ణయాలు బడ్జెట్‌లో ఉండే అవకాశాలున్నా యనే సంకేతాలను రాష్ట్రపతి తన ప్రసంగం ద్వారా ఇచ్చారు. దాదాపు 64 కోట్ల మంది ఓటర్లు తమ కర్తవ్యాన్ని ఉత్సాహంగా నిర్వర్తించారన్నారు. ఈసారి మహి ళలు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. కశ్మీర్ లోయలో రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదైందని తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగిస్తున్నంత సేపు ప్రధాని మోడీ సహా అధికార సభ్యులు బల్లలు చరిచారు.

## రాజీకి వచ్చిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

**సిఎం రేవంత్‌తో ఉదయం చర్చలు**
**కాంగ్రెస్ సీనియర్లకు ప్రధాన్యం తగ్గదని హామీ**

**న్యూఢిల్లీ,జూన్27(పీపుల్స్ మోటివేషన్):**

కాంగ్రెస్‌లో జీవన్ రెడ్డి వివాదం సద్దుమణిగింది. సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి గురువారం ఉదయం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వెళ్లారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి నివాసంలో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ జరిగింది. ఈ భేటీకి మంత్రి శ్రీధర్ బాబు కూడా హాజరయ్యారు. బుధవారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను జీవన్ రెడ్డి కలిసారు. అధిష్టానం జోక్యంతో జీవన్ రెడ్డి తన రాజీనామా విషయంలో వెనక్కి తగ్గారు. సిఎం రేవంత్‌తో చర్చించిన తరవాత చల్లబడ్డారు. ఈ క్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, శాసన సభ్యులు అడ్లూరి లక్ష్మణ్‌లు ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వీడడం ఖాయమన్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. తనకు సమాచారం ఇవ్వకుండానే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని తీవ్ర మనస్తాపం చెందిన జీవన్‌రెడ్డి ఎట్టకేలకు మెట్టు దిగారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవాళ్ల అభిప్రాయాల ఆధారంగానే చేరికలు, ఇతర విషయాలలో ముందుకెళతామని అధిష్ఠానం హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు. రంగంలోకి దిగిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పరిస్థితిని చక్కబెట్టారు. మూడ్రోజులుగా అసంతృప్తితో రగిలిపోతూ పార్టీని వీడేందుకు సిద్ధపడిన జీవన్‌రెడ్డికి పార్టీ అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. కేసీ వేణుగోపాల్ ఫోన్ చేసి ఢిల్లీ రావాలని కోరడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి బుధవారం సాయంత్రం జీవన్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో జీవన్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అరగంటపాటు చర్చలు జరిపారు. అయినా జీవన్‌రెడ్డి వెనక్కి తగ్గలేదు. తర్వాత ముగ్గురూ కలిసి కేసీ వేణు గోపాల్ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్లినా తాను పార్టీని నమ్ముకుని ఉన్నానని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ చేరికపై అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. జీవన్‌రెడ్డిని బుజ్జగించిన పెద్దలు.. పార్టీ అండగా ఉంటుందని, దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పు?ంజుకుంటున్న సమయంలో పార్టీని వీడవద్దని కోరినట్లు తెలిసింది. దీంతో చల్లబడిన జీవన్‌రెడ్డి సమ్మతించారు. భేటీ అనంతరం బయటికి వచ్చాక జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తనకు కాంగ్రెస్సే ముఖ్యమంటూ వెల్లడించారు. కార్యకర్తలను కాపాడుకోవడం ఏ పార్టీకైనా ముఖ్యమని అన్నారు. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి ఆలోచనలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రె?సకు మెరుగైన ఫలితాలు వచ్చాయని, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, జాతి ఐక్యతను కాంగ్రెస్ కాపాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో అమలుకాని పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీకి కాంగ్రెస్ సంకల్పించదని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## సిఎస్ నీరబ్ కుమార్ సర్వీసు పొడిగింపు

**ప్రభుత్వ అభ్యర్థను కేంద్రం అంగీకారం**
**మరో ఆరు నెలలపాటు ఆయనే ప్రభుత్వ కార్యదర్శి**

**అమరావతి,జూన్27(పీపుల్స్ మోటివేషన్):**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీ కాలం పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరో 6 నెలలు పొడిగించాలంటూ ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇటీవలే కేంద్రానికి లేఖ రాశారు. ఈ లేఖను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం నీరబ్ కుమార్ పదవీకాలాన్ని పొడగించింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ గురవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిజానికి ఈ నెలాఖరుకు నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీవిరమణ చేయాల్సి ఉంది. తాజా ఉత్తర్వులతో ఆయన మరో ఆరు నెలలు ఈ పదవిలో ఉండనున్నారు. ఆయన పదవీ కాలం జులై 1 నుంచి డిసెంబర్ 31 వరకూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా, కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాష్ట్ర సీఎస్‌గా నీరభ్ కుమార్ జూన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఆయన పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగుస్తుండడంతో ఇటీవల ప్రభుత్వం ఆయన సర్వీసు పొడిగించాలని కేంద్రానికి లేఖ రాసింది. ప్రభుత్వ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్రం ఆయన పదవీ కాలం పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వానికి కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సమాచారం ఇచ్చింది. నీరభ్ కుమార్ ప్రసాద్ సీఎస్ కావడానికి ముందు రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1988లో ప.గో జిల్లాలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. 1990లో తూ.గో సబ్ కలెక్టర్, 1991లో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో, 1992లో కృష్ణా జిల్లా పీడీ ఆర్డీఏగా పనిచేశారు. 1993లో కృష్ణా జిల్లా జేసీగా, 96లో ఖమ్మం కలెక్టర్‌గా, 98లో చిత్తూరు కలెక్టర్‌గా సేవలందించారు. 1999లో యువజన సంక్షేమ శాఖ డైరెక్టర్, శాప్ ఎండీగా పనిచేశారు. 2000వ సంవత్సరంలో డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులకు వెళ్లారు. 2005లో రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి ఎండీగా, 2007లో పరిశ్రమల శాఖ కమిషనర్‌గా, 2009లో మత్స్యశాఖ కమిషనర్‌గా సేవలందించారు. 2012లో రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2014లో జీఏడీ ముఖ్య కార్యదర్శిగా, 2015లో వైటీసీఏ ముఖ్య కార్యదర్శిగానూ విధులు నిర్వర్తించారు. 2017లో కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. 2018లో టీఆర్అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, 2019లో రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం ఏపీ సీఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

## నిలకడగా అద్వానీ ఆరోగ్యం

**యూరాలజీ వైద్యుల పర్యవేక్షణలో వైద్యం**
**ఎయిమ్స్ వైద్యుల ప్రకటన**

**న్యూఢిల్లీ,జూన్27(పీపుల్స్ మోటివేషన్) :**

బీజేపీ అగ్రనేత, మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని ఎయిమ్స్ ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఆయన్ని వైద్యులు నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపాయి. ప్రస్తుతం అద్వానీ వయసు 96 ఏళ్లు. వయో సంబంధిత అనారోగ్య సమస్యలతోనే ఆయనను ఆస్పత్రిలో చేర్చినట్టు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. మూడు నెలల కిందటే కేంద్ర ప్రభుత్వం అద్వానీకి దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నను ప్రదానం చేసిన విషయం తెలిసిందే. వృద్ధాప్య సంబంధ సమస్యలతో బాధపడుతున్న అద్వానీ రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ అవార్డుల కార్యక్రమానికి హాజరుకాలేకపోయారు. దీంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వయంగా అద్వానీ నివాసానికి వెళ్లి పురస్కారాన్ని అందించారు. మాజీ ఉప ప్రధాని, బీజేపీ సీనియర్ నేత లాల్ కృష్ణ అద్వానీ ఆరోగ్యం క్షీణించడంతో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేర్పించారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయనను బుధవారం రాత్రి 10.30 గంటలకు ఎయిమ్స్‌లో చేర్చారు. అద్వానీకి యూరాలజీకి సంబంధించిన సమస్యలు ఉన్నాయి. యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ అమలేష్ సేథ్ ఆధ్వర్యంలో ఆయన చికిత్స పొందుతున్నారు. అద్వానీ మెడికల్ బులెటిన్‌ను ఎయిమ్స్ వైద్యులు, వైద్య నిపుణులు త్వరలో విడుదల చేయనున్నారు. ఎల్‌కే అద్వానీ దేశ అత్యున్నత పౌర గౌరవ పురస్కారమైన భారతరత్నను ఈ ఏడాది 2024లోనే స్వీకరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎల్‌కే అద్వానీ నివాసానికి వెళ్లి భారతరత్నతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా పాల్గొన్నారు. అద్వానీ ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆయన నివాసంలోనే ఆయనకు భారతరత్నను ప్రదానం చేశారు. ఎల్‌కే అద్వానీ 1927 నవంబర్ 8న అవిభాజ్య భారతదేశంలో, ప్రస్తుత పాకిస్థాన్‌లోని కరాచీలో జన్మించారు. సెప్టెంబర్ 12, 1947న పాకిస్థాన్‌ను విడిచిపెట్టి అతని కుటుంబం భారతదేశానికి వచ్చిందని ఆయన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. లాల్ కృష్ణ అద్వానీకి ఒక కుమార్తె ప్రతిభా అద్వానీ, కుమారుడు జయంత్ అద్వానీ ఉన్నారు. అద్వానీ కొడుకు, కుతురు ఇద్దరూ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. కరాచీలోని సెయింట్ పాట్రిక్స్ స్కూల్ నుంచి తన ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. విభజన తర్వాత భారతదేశంలోని ముంబైలోని ప్రభుత్వ న్యాయ కళాశాల నుంచి న్యాయ పట్టా అందుకున్నారు. అద్వానీ ఫిబ్రవరి 25, 1965న కమల అద్వానీని వివాహం చేసుకున్నారు. అద్వానీ దేశభక్తి కారణంగా ఆర్‌ఎస్ఎస్ వైపు మొగ్గు చూపారు. 1947లో దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పుడు, లాల్ కృష్ణ అద్వానీ ఈ స్వాతంత్ర్య వేడుకలను జరుపుకోలేకపోయారు. ఎందుకంటే అప్పుడు ఆయన పాకిస్తాన్‌లో ఉన్నారు. దేశ విభజన తర్వాత కరాచీ నుంచి ఢిల్లీకి వచ్చి రాజస్థాన్‌లో సంఘ్ ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సంఘ్ ప్రచారక్‌గా చాలా కాలం పనిచేశారు. 1947 నుంచి 1951 వరకు కరాచీ శాఖ ఖా కార్యదర్శిగా, భరత్‌పూర్, అల్వార్, బుండి, కోట, ఝులావర్‌లలో ఖా కార్యక్రమాలను నిర్వహించారు. లాల్ కృష్ణ అద్వానీ రాజకీయ ప్రయాణం గురించి మాట్లాడుకుంటే 1951లో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జన్ సంఘ్ స్థాపించినప్పుడు, 1957 వరకు అద్వానీ పార్టీ కార్యదర్శిగా ఉన్నారు. ఆ తర్వాత 1973 నుంచి 1977 వరకు జన్ సంఘ్ అధ్యక్షుడిగా పనిచేశారు. 1980లో భారతీయ జనతా పార్టీ స్థాపించినప్పుడు, ఆయన దాని వ్యవస్థాపక సభ్యుడిగా ఉన్నారు. అద్వానీ 1980 నుంచి 1986 వరకు బీజేపీ ప్రధాన కార్యదర్శిగా, 1986 నుంచి 1991 వరకు బీజేపీ అధ్యక్షుడిగా వర్క్ చేశారు. అద్వానీ మూడుసార్లు బీజేపీ అధ్యక్షుడిగా, 5 సార్లు లోక్‌సభ ఎంపీగా, 4 సార్లు రాజ్యసభ ఎంపీగా పనిచేశారు. 1977 నుంచి 1979 వరకు తొలిసారిగా కేంద్రంలో మంత్రిగా పనిచేశారు. ఆ కాలంలో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ బాధ్యతలు చేపట్టారు. రాజకీయాల్లో 'యాత్రల' సంస్కృతికి నాంది పలికిన నాయకుడు లాల్ కృష్ణ అద్వానీ. అయోధ్యలో రామమందిరానికి డిమాండ్ ఉధృతంగా ఉన్న సమయంలో, లాల్ కృష్ణ అద్వానీ గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి అయోధ్య వరకు రథయాత్ర ప్రారంభించారు. దీని కారణంగా దేశ రాజకీయాల్లో హిందూత్వ రాజకీయాలు ఉద్భవించాయి. కానీ బీహార్‌లో అప్పటి ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ ఆయనను సమస్తిపూర్‌లో అరెస్టు చేశారు. ఈ సంఘటన తర్వాత అద్వానీ రాజకీయాల్లో హీరోగా ఎదిగారు.

## రైతుబంధు ఎప్పుడిస్తారో చెప్పండి

**జడ్పీ సమావేశంలో హరీష్ రావు డిమాండ్**

**సిద్దిపేట,జూన్27(పీపుల్స్ మోటివేషన్) :**

రైతు బందు డబ్బులు ఎప్పుడు వేస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ప్రశ్నించారు. రైతుభరోసా విధివిధానాలు ఏమిటని అడిగారు. రైతుబంధు పంట అయ్యాక ఇస్తారా?.. పంట ముందు ఇస్తారా? అంటూ హరీష్ రావు ప్రశ్నల వర్షం కురిపించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రెడ్డి సంక్షేమ సంఘంలో జడ్పీ చైర్మన్ రోజా శర్మ అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ మను చౌదరి ఎమ్మెల్యేలు హరీష్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సిద్దిపేట జిల్లాను పదవ తరగతి ఫలితాల్లో రెండవ స్థానంలో నిలిపినందుకు ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. నాలుగు నెలల మధ్యాహ్నం భోజన కార్మికులకు జీతాలు వెంటనే విడుదల చేయాలి. విద్యార్థులకు ఒక్క జత బట్టలు మాత్రమే ఇచ్చారు. రెండవ జత బట్టలు అన్ని జిల్లాలకు ఇచ్చినట్లు సిద్దిపేట జిల్లకు వెంటనే ఇవ్వాలి. మన ఊరు మన బడి మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసి ఇవ్వాల్సిన బిల్లులు ఇవ్వాలి. ఉపాధి హామీ పథకంలో సీసీ రోడ్ పోసిన కాంట్రాక్టర్‌లకు 7నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏప్రిల్, మే, జూన్ మూడు నెలల ఆసరా పెన్షన్‌లు రాలేదు. సకాలంలో పెన్షన్ రాక వృద్దులు ఇబ్బంది పడుతున్నారు. కాళేశ్వరం కాలువలలో మట్టి పడి నీటి విడుదలలో ఇబ్బంది ఉంది కనుక వాటిని శుద్ధి చేయాలి. ఆరు నెలల్లో గ్రామపంచాయితీలకు రూపాయి రాలేదు. మహిళ ప్రాంగణం, వృద్దాశ్రమం, వర్కింగ్ ఉమెన్ హాస్టల్ వాడుకలోకి తీసుకురావాలి. సఖి సెంటర్ సిబ్బందికి 7నెలలుగా వేతనాలు రాలేదు' అని హరీష్ రావు పేర్కొన్నారు.

## నగరంలో పలుచోట్ల భారీ వర్షం

**హైదరాబాద్,జూన్27(పీపుల్స్ మోటివేషన్):**

నగరంలోని పలు చోట్ల గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, నిజాంపేట్, ప్రగతినగర్, బోరబండ, యూసుఫ్‌గూడ, జూబ్లీహిల్స్, మైత్రీవనం, అమీర్‌పేట, పంజాగుట్ట, రామంతాపూర్, ఉప్పల్, దిల్‌షుక్‌నగర్, ఎల్బీనగర్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. వరద ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. రాష్ట్రంలో రాగల వారంరోజులు పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో భారీ వర్షాలతో పాటు ఉపరితల గాలులు వీస్తాయని పేర్కొంది. గురువారం నుంచి శుక్రవారం వరకు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని చెప్పింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో బలమైన ఉపరితలగాలులు వీస్తాయని పేర్కొంది. శుక్రవారం నుంచి శనివారం పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో ఉపరితల గాలులువీస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇక గడిచిన 24 గంటల్లో జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట, హన్మకొండ, జనగామ జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. పలుచోట్ల మోస్తరు వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

శుక్రవారం । జూన్ । 28 । 2024

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation



# ప్రసాద్ ఐ మాక్స్ వద్ద సందడి



రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా రూపొందిన 'కల్కి 2898 ఏడీ' రిలీజ్ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ఐమాక్స్ వద్ద సందడి నెలకొంది. సినిమా చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సినిమాలో ఉపయోగించిన 'బుజ్జి' (వాహనం)ని అక్కడ ప్రదర్శనకు ఉంచారు. దాని వద్ద ఫొటోలు తీసుకునేందుకు ఫ్యాన్స్ పోటీ పడ్డారు. పెద్ద ఎత్తున అభిమానులు తరలి రావడంతో ఐమాక్స్ వద్ద ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.




# విజయ్ సరసన జాన్వీకపూర్



**కోలీవుడ్‌లో జోరుగా ప్రచారం**


అగ్రనటుడు విజయ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ నటించనుందనే వార్త కోలీవుడ్‌లో హల్చల్ చేస్తుంది. ప్రస్తుతం విజయ్ 'ది గోట్' చిత్రంలో నటించారు. ఆ తర్వాత హెచ్. వినోద్ దర్శకత్వంలో విజయ్ తన 69 వ చిత్రంలో నటించనున్నారు. ఇందులో పలువురు హీరోయిన్ల పేర్లను పరిశీలించినప్పటికీ చివరకు జాన్వీ కపూర్‌ను ఎంపిక చేసినట్టు వార్తలు వస్తున్నాయి. ఇటీవలకాలంలో జాన్వీ కపూర్ ఎక్కువగా ముంబై టు చెన్నై మధ్య చక్కర్లు కొడుతున్నారు. చెన్నైతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోని పుణ్యస్థలాలను సందర్శిస్తోంది. అయితే, తన తల్లి శ్రీదేవి నిలదొక్కుకున్న తమిళంలో తాను ఎంట్రీ ఇచ్చేందుకు ఆమె ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో తన కుమార్తె కోర్కెను తీర్చేందుకు ఆమె తండ్రి, బాలీవుడ్ నిర్మాత బోనీ కపూర్ ముందుకు వచ్చారు. విజయ్ 69వ చిత్రంలో కుమార్తెకు అవకాశం ఇప్పించేందుకు తన వంతు ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీనికి కారణం లేకపోలేదు. హెచ్. వినోద్ (ఊ ÷ఎతినినీట) దర్శకత్వంలో అజిత్ హీరోగా నటించిన 'వలిమై', 'తుణివు' చిత్రాలను బోనీ కపూర్ నిర్మించారు. దీంతో దర్శకుడు హెచ్. వినోద్ - బోనీ కపూర్ మధ్య మంచి సత్సంబంధాలు ఉండటంతో విజయ్ చిత్రంలో జాన్వీ కపూర్‌ను హీరోయిన్‌గా నటింపజేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారని టాక్ వినిపిస్తుంది. మరో వైపు జాన్వీ కపూర్ ఇప్పటికే సౌత్‌లో తన సత్తా చాటేందుకు సిద్ధమైంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ 'దేవర సినిమాలోనూ.. అలాగే గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ , బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఖీఅ16 చిత్రంలోనూ ఆమె అవకాశం సొంతం చేసుకుంది. 'దేవర' చిత్రం రెండు పార్ట్‌లుగా రానుంది కాబట్టి.. జాన్వీలో సౌత్‌లో మూడు సినిమాలు చేస్తున్నట్లుగా చెప్పకోవచ్చు. ఇప్పుడు విజయ్ సినిమాలో కూడా ఆమెకు అవకాశం వచ్చినట్లుగానే టాక్ వినబడుతోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.




## నిఖిల్ స్వయంభూలో కీలక సన్నివేశాల చిత్రీకరణ

నిఖిల్ మోస్ట్ ఎవైటెడ్ పాన్-ఇండియా ప్రాజెక్ట్ 'స్వయంభూ మారేడుమిల్లిలోని బ్యూటీఫుల్ లోకేషన్స్ లో కొత్త షూటింగ్ షెడ్యూల్ ప్రారంభమైంది. మారేడుమిల్లిలోని దట్టమైన అడవులలో నిఖిల్ పై కొన్ని కీలక సన్నివేశాలను ఈ షెడ్యూల్ లో చిత్రీకరిస్తున్నారు. నిఖిల్ హీరోగా 20వ చిత్రంగా పీరియాడికల్ జానర్‌లో రూపొందుతున్న ఈ సినిమా ఆయన కెరీర్‌లో మైల్ స్టోన్ మూవీగా ఉండేలా దర్శకుడు భరత్ కృష్ణమాచారి తెరకెక్కిస్తున్నాడు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ పతాకంపై భువన్, శ్రీకర్ ఈ 'స్వయంభూస చిత్రాన్ని అత్యున్నత ప్రొడక్షన్ వాల్యూస్, టెక్నికల్ స్టాండర్డ్స్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నిఖిల్ లెజెండరీ వారియర్ పాత్రను పోషిస్తుండగా ఆ పాత్ర కోసం ఆయన ప్రత్యేక శిక్షణ కూడా తీసుకోవడం విశేషం. సంయుక్త, నభా నటేష్ హీరోయిన్స్ గా నటిస్తుండగా రవి బస్రూర్ సంగీతం, కెకె సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎం ప్రభాకరన్ ప్రొడక్షన్ డిజైనర్‌గా చేస్తున్నారు.

# గేమ్ ఛేంజర్‌ను త్వరగా పూర్తి చేస్తా : శంకర్



రామ్‌చరణ్ - శంకర్‌ల కాంబోలో తెరకెక్కుతోన్న సినిమా 'గేమ్ ఛేంజర్' చిత్రం నుంచి అప్‌డేట్ వచ్చి చాలా రోజులవుతోంది. తాజాగా దర్శకుడు శంకర్ దీనిపై అప్‌డేట్ ఇచ్చారు. 'ఇండియన్ 2' ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'గేమ్ ఛేంజర్' గురించి మాట్లాడారు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తయింది. ఇంకా 10 రోజుల చిత్రీకరణ మాత్రమే మిగిలిఉంది. 'ఇండియన్ 2' రిలీజ్ కాగానే 'గేమ్ ఛేంజర్' ప్రొడక్షన్ పనులు పూర్తి చేస్తాను. ఆ తర్వాత ఫైనల్ ఫుటేజ్ చూసి పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభిస్తాను. అన్ని పనులు పూర్తయిన తర్వాత రిలీజ్‌పై ఓ నిర్ణయం తీసుకుంటా. సాధ్యమైనంతవరకు త్వరగానే రిలీజ్ చేయడానికి ప్రయత్నిస్తా' అని శంకర్ చెప్పారు. అలాగే హీరో సిద్దార్థ్ మాట్లాడుతూ.. శంకర్ ఓ సినిమాలో 2000 మందితో సన్నివేశాలు చిత్రీకరించారు. అవి అద్భుతంగా ఉన్నాయని అన్నారు. దీంతో సిద్దార్థ్ చెప్పింది 'గేమ్ ఛేంజర్' గురించేనని రామ్‌చరణ్ అభిమానులు భావిస్తున్నారు. ఇక ఈ సినిమా విషయానికొస్తే.. పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ కథాంశంతో సిద్ధమవుతోంది. ఇందులో రామ్ చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నట్లు సమాచారం. కియారా అద్వానీ హీరోయిన్‌గా కనిపించనుండగా.. అంజలి, శ్రీకాంత్, సునీల్, ఎస్.జె.సూర్య, సముద్రఖని, నవీన్ చంద్ర తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు.

Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com